RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 270 మేడ్చల్ మల్కాజ్‌గిరి 23 అక్టోబర్ 2024 బుధవారం పేజీలు : 4

## రైళ్లలో ఆహారం సరఫరాకు క్లౌడ్ కిచెన్లు

ముంబై : రైళ్లలో అందించే ఆహార నాణ్యతపై తరచూ ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో రైల్వే ప్రయాణికులకు క్లౌడ్ కిచెన్ల ద్వారా ఆహారాన్ని సరఫరా చేయాలని ఐఆర్‌సీటీసీ నిర్ణయించింది. ప్రస్తుతం రైళ్లలో ఆహార సరఫరా కోసం పెద్ద పెద్ద రైల్వే స్టేషన్ల దగ్గర బేస్ కిచెన్లు ఉన్నాయి. వీటిల్లో వేలాది మంది కోసం ఆహారాన్ని వండి, ప్యాకింగ్ చేసి రైళ్లలో అందజేస్తున్నారు. వీటిని ఐఆర్‌సీటీసీ నిర్వహిస్తోంది. అయితే, బేస్ స్టేషన్లలో పరిశుభ్రత పాటించడం లేదన్న ఆరోపణలున్నాయి. దీంతో, ఐఆర్‌సీటీసీ క్లౌడ్ కిచెన్లపై దృష్టి సారించింది. ఇవి ప్రైవేటు ఆపరేటర్ల నియంత్రణలో ఒప్పందం ప్రకారం నడుస్తాయి. సాధారణంగా ఈ ఒప్పందం ఏడేళ్ల పాటు ఉంటుంది. ప్రైవేటు క్యాటరింగ్ సంస్థలు ఆహారాన్ని వండి రైళ్లలో అందజేయాల్సి ఉంటుంది.



# మీకు.. మీ పార్టీకి ఓ దండం..

## కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి గుడ్ బై..?

## అనుచరుడి హత్యతో తీవ్ర ఆవేదనకు గురైన పెద్దాయన!

జగిత్యాల : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు , ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సొంత పార్టీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవన్ రెడ్డి అనుచరుడు మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘటనపై జీవన్ రెడ్డి సీరియస్‌గా రియాక్ట్ అయ్యారు. గంగారెడ్డిని దారుణంగా హత్య చేయడంతో రాష్ట్రంలోని శాంతిభద్రతలపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

గంగారెడ్డి హత్యను నిరసిస్తూ తన అనుచరులతో కలిసి జగిత్యాల–ధర్మపురి రహదారిపై జీవన్ రెడ్డి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.

**మీకు.. మీ పార్టీకి ఓ దండం..!** 'మాకు నలుగురికి సేవ చేయడమే తెలుసు.. ఏదైనా స్వచ్ఛంద సంస్థ పెట్టుకుని అయినా ప్రజలకు సేవ చేస్తా. ఇక మీకు.. మీ పార్టీకి ఓ దండం. ఇకనైనా మమ్మల్ని బతకనివ్వండి. ఇంతకాలం అవమానాలకు గురైనా తట్టుకున్నాం.. మానసికంగా అవమానాలకు గురవుతున్నా భరించాం.. కానీ ఇవాళ భౌతికంగా లేకుండా చేస్తే ఎందుకు.'అని కాంగ్రెస్ పార్టీని జీవన్ రెడ్డి ప్రశ్నించారు. తన అనుచరుడిని హత్య చేయడం అంటే తనను కూడా హత్య చేసినట్లే అని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. క్రియాశీలకంగా పార్టీలో పనిచేస్తే చంపేస్తారా అని ప్రశ్నించారు. దీంతో జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు కాంగ్రెస్ పార్టీ రంగంలోకి దిగింది. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ జీవన్ రెడ్డితో ఫోన్లో మాట్లాడారు. మహేష్ కుమార్ గౌడ్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన జీవన్ రెడ్డి మధ్యలోనే ఫోన్ కట్ చేశారు. గంగారెడ్డిని చంపిన వారిని పట్టుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు. ఇక రాజకీయంగా కూడా కాంగ్రెస్ పార్టీ తీరుపై జీవన్ రెడ్డి అసంతృప్తితో ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల ఎమ్మెల్యేగా పోటీ చేసిన జీవన్ రెడ్డి ఓటమి చవిచూశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో జీవన్ రెడ్డికి సముచిత స్థానమే దక్కింది. అయితే ఆ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. జగిత్యాల ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ పార్టీ నుంచి విజయం సాధించిన డాక్టర్ సంజయ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. డాక్టర్ సంజయ్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం వెనుక సీఎం రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. తనకు ఎటువంటి సమాచారం లేకుండా తన రాజకీయ ప్రత్యర్థిని పార్టీ చేర్చుకోవడంపై జీవన్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకనొక సమయంలో ఆయన కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే యోచన కూడా చేశారు. ఇప్పుడు తన అనుచరుడనే హత్య చేయడంతో ఆయన కాంగ్రెస్ పార్టీలో కొనసాగలేనని తేల్చి చెప్పారు.

# 2027లోనే జమిలి ఎన్నికలు

## – సిద్ధమవుతున్న కేంద్ర ప్రభుత్వం



డిల్లీ : దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహిస్తామని గత కొంతకాలంగా బీజేపీ చెబుతోన్న సంగతి తెలిసిందే. ఇటీల కేంద్ర కేబినెట్ కూడా వన్ నేషన్– వన్ ఎలక్షన్ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా ఒకేసారి జమిలి ఎన్నికలు నిర్వహిస్తామని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా కూడా ప్రకటించారు. వచ్చే శీతాకాలం పార్లమెంటులో కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టే ఛాన్స్ ఉందనే వార్తలు కూడా వచ్చాయి. అయితే దీనికి సంబంధించి తాజాగా మరో కీలక విషయం బయటపడింది. 2027లో భారత్‌లో మొత్తం ఒకేసారి ఫిబ్రవరిలో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో జమిలీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

**5 ఆర్టికల్స్ సవరణ చేయాలి..** జమిలీ ఎన్నికల సాధ్యాసాధ్యాలపై గతంలోనే మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

ఈ కమిటీ కూడా పూర్తిస్థాయిలో పరిశీలన జరిపింది. తాను రూపొందించిన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి కూడా అందజేసింది. అయితే దేశవ్యాప్తంగా జమిలీ ఎన్నికలు జరగాలంటే రాజ్యాంగంలోని 5 ఆర్టికల్స్ సవరణ చేయాలని ఈ కమిటీ తెలిపింది. ఆర్టికల్ 83,85,172,174,356లను బిల్లు ద్వారా సవరణ చేయాలని సూచనలు చేసింది.

**67 శాతం సభ్యుల మద్దతు అవసరం...** అయితే ఈ బిల్లు ఆమోదం పొందాలంటే కొన్ని పరిణామాలు జరగాల్సి ఉంటుంది. జమిలీ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ కావాలంటే.. లోక్‌సభ, రాజ్యసభలో 67 శాతం మంది సభ్యులు ఈ బిల్లుకు మద్దతు తెలపాలి. అలాగే 14 రాష్ట్ర అసెంబ్లీలు సైతం మద్దతు ఇవ్వాలి. ఇలా జరిగితేనే ఈ బిల్లుకు ఆమోదం లభిస్తుంది. తద్వారా జమిలీ ఎన్నికలకు మార్గం సుగమమవుతుంది. ఒకవేల పార్లమెంటులో లేదా రాష్ట్రాల నుంచి మద్దతు దొరకకపోతే ఈ బిల్లు ఆమోదం సాధ్య కాదు.

**2027 టార్గెట్...** ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది శీతాకాల సమావేశాల్లోనే ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ బిల్లుకు పార్లమెంట్‌లో మద్దతు లభించినట్లైతే 2027లో ఉత్తరప్రదేశ్ ఎన్నికలతో పాటు దేశం మొత్తం ఒకేసారి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం. అలాగే ఈ ఎన్నికలు జరిగిన 100 రోజుల తర్వాత మున్సిపల్, గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహి స్తారు. దేశంలో పరిపాలన సౌలభ్యం కోసమే ఈ జమిలి ఎన్నికలు నిర్వహిస్తామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ ఘోషి తెలిపారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, హర్యానా, జమ్మూకశ్మీర్ తదితర రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే.

వీటికి 2029 వరకు పాలించే హక్కు ఉంటుంది. అలాగే త్వరలో మహారాష్ట్ర, ఝార?ండ్, వచ్చే ఏడాది ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో తెలంగాణలో కూడా అసెంబ్లీ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. అయితే ఈ రాష్ట్రాలు తమకు మిగిలి ఉన్న పాలనాకాలాన్ని రద్దు చేసుకొని జమిలీ ఎన్నికలకు మద్దతిస్తాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

**ప్రాంతీయ పార్టీలకు నష్టం..** అయితే మెజార్టీ రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంది. దీనివల్ల జమిలీ ఎన్నికలు సాధ్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని పలువురు నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే 2027లో జమిలీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది.

మరోవైపు జమిలీ ఎన్నికలు నిర్వహిస్తే ప్రాంతీయ పార్టీ అస్థిత్వానికి దెబ్బపడుతుందని మరికొందరు అంటున్నారు. జమిలీ ఎన్నికల్లో రాష్ట్రాల సమస్యలు కాకుండా జాతీయ సమస్యలపైనే ఓటర్ల దృష్టి మళ్లుతుందని.. దీనివల్ల బీజేపీ పార్టీకే అనుకూలంగా ఉంటుందనే వాదనలు వినిపిస్తున్నారు. మరీ జమిలీ ఎన్నికలు జరుగుతాయా ? లేదా ? అనేది తెలియాలంటే మరికొంత కాలం వేచిచూడాల్సిందే. వచ్చే శీతాకాల సమావేశంలో దీనిపై ఓ స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది.




హైదరాబాద్: ధరణి పోర్టల్ నిర్వహణను తెలంగాణ ప్రభుత్వం ఎన్ఐసీ కి అప్పగించింది. మూడేళ్ల నిర్వహణకు ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐసీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. పనితీరు బాగుంటే మరో రెండేళ్లు పొడిగిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందంలో పేర్కొంది.

## సియోల్‌లో రెండో రోజు తెలంగాణ మంత్రుల బృందం పర్యటన



సియోల్: దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో తెలంగాణ మంత్రుల పర్యటన కొనసాగుతోంది. దక్షిణ కొరియాలోని ముఖ్యమైన హన్ నది పునరుజ్జీవన ప్రాజెక్ట్‌ను మంత్రులు, అధికారుల బృందం పరిశీలించింది. సియోల్ నగరంలో నీటి సరఫరా, పర్యావరణం, ఆర్థిక వ్యవస్థకు ఈ నది కీలకంగా మారింది. కాలుష్యానికి గురైన హన్ నదిని శుభ్రపరిచి దక్షిణ కొరియా ప్రభుత్వం పునరుద్ధరించింది. మొత్తం 494 కి.మీ. విస్తీర్ణంలో ఉన్న ఈ నది.. సియోల్ నగరంలో 40 కి.మీ. మేర ప్రవహిస్తోంది. ప్రక్షాళన తర్వాత శుభ్రంగా మారి, ఇప్పుడు సియోల్ నగరానికి ఒక ముఖ్యమైన పర్యాటక ప్రదేశం, జలవనరుగా మారింది. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పురపాలకశాఖ, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఈ నదిని పరిశీలించారు.

# 200 గజాల స్థలం, రూ.30 లక్షలు..!

## కేబినెట్ భేటీలో దీనిపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం!!




హైదరాబాద్ : మూసీ నిర్వాసితులకు అండగా ఉండేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. వారికి ఔటర్ రింగ్ రోడ్డు వెంట ఇంటి నిర్మాణం కోసం స్థలం ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. కాగా ఇప్పటికే మూసీ నిర్వాసితులకు రూ.25వేల ఆర్థిక సాయంతో పాటు డబుల్ బెడ్ రూం ఇండ్లు, ఉపాధి కోసం రూ.2 లక్షల లోన్లను ఇవ్వనున్నట్లు ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే.

**150 నుంచి 200 చదరపు గజాలు..** మూసీ బఫర్, ఎఫ్టీఎల్ లో ఇళ్లు నిర్మించుకున్న వారికి.. వాటిని ఖాళీ చేసే సమయంలో డబుల్ బెడ్రూం ఇళ్లతో పాటు స్థలాలు కూడా ఇవ్వాలనే యోచనలో సీఎం రేవంత్ సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కో కుటుంబానికి ఇంటి నిర్మాణం కోసం ఔటర్ రింగ్ రోడ్డు పక్కన 150 నుంచి 200 చదరపు గజాల స్థలం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా ఈ నెల 26న జరగబోయే కేబినెట్ భేటీలో దీనిపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కాగా ఇచ్చే స్థలం విలువ రూ.25 లక్షల నుంచి రూ. 30 లక్షల దాకా ఉంటుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇందుకు అవసరం అయ్యే 700 ఎకరాలను ప్రభుత్వం కేటాయించనున్నట్లు తెలుస్తోంది.

**రూ.1200 కోట్లు...** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ నది సుందరీకరణ కార్యక్రమంలో ఇల్లు కోల్పోతున్న నిర్వాసిత కుటుంబాలపై రేవంత్ సర్కార్ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇప్పటికే వారందరికీ 15 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఒక్కో ఇంటి కోసం రూ.8లక్షల ఖర్చు అవుతుండగా.. మొత్తం రూ.1200 కోట్లను మూసీ రివర్ ఫ్రంట్ కార్పొరేషన్ నుంచి హౌసింగ్ డిపార్ట్మెంట్కు నగదు బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

కాగా మూసీ నది గర్భంలో నివాసం ఉంటున్న అనేక మంది ఇప్పటికే ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్రూం ఇళ్లలోకి వెళ్లారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో స్థలాలు కొని ఇళ్లు కట్టుకున్న వారు మాత్రం ససేమిరా అంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీ తమకు అవసరం లేదని తేల్చిచెబుతున్నారు.

కోట్ల విలువైన తమ భవనాలను వదిలేసి డబుల్ బెడ్రూం ఇళ్లలోకి ఎలా వెళ్తామని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే అనేక మంది నిర్వాసితులు హైకోర్టును సైతం ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. వీరిని ఒప్పటించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇళ్ల స్థలాల కేటాయించాలని భావిస్తున్నట్లు సచివాలయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

# సంపాదకీయం

## కూటమి భారీ బడ్జెట్...

## నిధులు ఎలా సర్దుబాటు ?

తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చిన దాదాపు అయిదు నెలల తరువాత అంటే నవంబర్ లో తొలి బడ్జెట్ ని ప్రవేశపెట్టనుంది. ఆర్థిక మంత్రి హోదాలో పయ్యావుల కేశవ్ శాసనసభలో బడ్జెట్ ని ప్రవేశపెడతారు. ఈ బడ్జెట్ దాదాపుగా మూడు లక్షల కోట్ల దాకా ఉండవచ్చు అని అంచనా వేస్తున్నారు. వైసీపీ అయిదేళ్ళ బడ్జెట్ లో దిగిపోయేనాటికి రెండు లక్షల డెబ్బై వేల కోట్ల దాకా వచ్చింది. దానిని అధిగమించేలా టీడీపీ కూటమి బడ్జెట్ మూడు లక్షల కోట్లుగా అంచనా వేస్తున్నారు. ఈ బడ్జెట్ కేవలం అయిదు నెలలకు మాత్రమే అన్నది తెలిసిందే. ఎందుకంటే మార్చి అంతానికి ఈ బడ్జెట్ కాలపరిమితి ముగుస్తుంది. అయితే ఈ బడ్జెట్ ద్వారా కూటమి సర్కార్ తమది అభివృద్ధి సంక్షేమ బాట అని చెప్పదలచుకుంది అని అంటున్నారు. దాంతో బడ్జెట్ లో భారీ నంబర్లే కనిపిస్తాయని అంటున్నారు. ఈ బడ్జెట్ లో సంక్షేమ పథకాలకు ఏకంగా లక్షా 20 వేల కోట్లు ఖర్చు చేయడానికి నిధులను కేటాయిస్తారు అని అంటున్నారు. తల్లికి వందనం పథకం, అలాగే రైతులకు భరోసా కింద అన్నదాతా సుఖీభవ పథకం, అంతే కాదు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అంతే కాదు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం, పద్దెనిమిదేళ్ళు దాటిన మహిళలకు నెలకు పదిహేను వందల రూపాయలు వారి ఖాతాలో వేసి ఆర్ధిక స్వావలంబన కల్పించడం, ఇక నిరుద్యోగ యువతకు నెలకు మూడు వేల రూపాయలు ఇవ్వడం ఇవన్నీ కూటమి ఇచ్చిన హామీలు. ఇందులో మెజారిటీ పథకాలు కూటమి బడ్జెట్ లో కనిపిస్తాయని అంటున్నారు. ఇలా సంక్షేమ పథకాలకు అయ్యే ఖర్చు కేటాయింపులు దేని నుంచి చేయాలి అన్న దాని మీదనే ప్రస్తుతం అధికార యంత్రాంగం మధింపు చేస్తోంది అని అంటున్నారు. ఇక ఏపీలో ప్రభుత్వానికి వివిధ పన్నుల ద్వారా కేంద్రం నుంచి వచ్చే వివిధ ఆదాయాల ద్వారా వచ్చేది అన్నీ కలుపుకుని చూస్తే జీతాలు ప్రభుత్వ పెన్షన్లు సామాజిక పెన్షన్లకు అలా సరిపోతుంది. ఇక కొత్తగా చేసిన అప్పులకు పాత అప్పులకు వడ్డీలు కట్టేందుకు నిధులు కూడా కావాలి. దానికి తోడు అన్నట్లుగా ఇపుడు సంక్షేమ పథకాలకు కూడా అప్పులు తెచ్చి మాత్రమే ఇవ్వాలని అంటున్నారు. అయితే బడ్జెట్ లో మాత్రం భారీగా అంకెలు వేసి నిధులు చూపించినా ఖజానాలో అయితే ఆదాయం అంత లేదని అంటున్నారు. దాంతో అప్పులు చేసుకునే వెసులుబాటు ఎటూ ఉంటుంది కాబట్టి ఆ ధీమాతో ఈ బడ్జెట్ లో భారీగానే కేటాయింపులు చేస్తారని అంటున్నారు. మరో వైపు చూస్తే ఇప్పటికే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అప్పులు పాతిక వేల కోట్ల దాకా చేశారు అని అంటున్నారు, ఇపుడు సూపర్ సిక్స్ హామీలకు కూడా అప్పులు తెచ్చి మాత్రమే ఇవ్వాలని అంటున్నారు. గత అయిదేళ్లలో వైసీపీ అధినాయకత్వం కూడా అప్పులు తెచ్చి మాత్రమే సంక్షేమ పథకాలను పంపిణీ చేసింది అని గుర్తు చేస్తున్నారు. ఇక ఈసారి బడ్జెట్ లో అభివృద్ధి విషయం తీసుకుంటే అమరావతి రాజధానికి కేంద్రం పూచీకత్తు మీద ప్రపంచ బ్యాంకు నుంచి రుణం 15 వేల కోట్ల రూపాయలు వస్తోంది. దాంతో దానిని బడ్జెట్ లో చూపిస్తూనే మరో పాతిక వేల కోట్లను కూడా కలిపి అమరావతి రాజధానికి యాభై వేల కోట్లు కేటాయిస్తున్నట్లుగా చూపిస్తారు అని అంటున్నారు. అదే విధంగా పోలవరం ప్రాజెక్టు కూడా ఏపీకి జీవనాడి. అత్యంత కీలకంగా ఉంది. దాని విషయంలో కూడా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. దాంతో పాటు పోలవరానికి కేంద్రం నిధులను కేటాయిస్తోంది. వాటిని బడ్జెట్ లో చూపిస్తారు అని అంటున్నారు. ఇక ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏపీలోని రోడ్ల నిర్మాణం ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు కూడా భారీగానే నిధుల కేటాయింపులు చేస్తారు అని అంటున్నారు. మొత్తానికి కూటమి తొలి బడ్జెట్ అటు అభివృద్ధి ఇటు సంక్షేమం సమతూకంగా ఉంటుందని అంటున్నారు.


## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ





శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఆలయం తరపున గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టగా మండలం కేంద్రం శామీర్ పేటకు చెందిన కుమావత్ విష్ణు- కాంతా దేవి దంపతులు వారి కుటుంబ సభ్యులు అన్నదానాకి 1 క్వింటాల్ 25 కేజీల బియ్యం అందజేశారు. వివిధ గ్రామాల భక్తులు మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

## చెరువుల చెర వీడేనా?



మల్యాల : 'హైడ్రా' ఈపేరు వింటేనే చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వ్యక్తుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. హైదరాబాద్ పట్టణ శివారులోని చెరువుల పరిరక్షణ కోసం ప్రభుత్వం 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా)'ను అమలులోకి తీసుకొచ్చింది. హైడ్రా కమిషనర్ ఆధ్వర్యంలో చెరువులు, కుంటల్లో అక్రమ నిర్మాణాలు తొలగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను పలువురు స్వాగతిస్తున్నారు. ఇదే తరహాలో మండలాలు, గ్రామాల పరిధిలోని చెరువులు, కుంటల పరిరక్షణకు కూడా ప్రభుత్వం కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మల్యాల మండలంలోని పలు చెరువులు, కుంటల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో వాటి ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. మండల కేంద్రంలోని మత్తడి చెరువులో ఇప్పటికే సగం పూడ్చివేసి ఎఫ్‌టీఎల్ పరిధిలో భవనాలు నిర్మించారు. చెరువులో ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులు నీటిలో మునిగిపోకుండా మట్టిని పోసి చెరువు ప్రాంతాన్ని పూడ్చి వేస్తున్నారు. దీంతో చెరువులో నీటి నిలువ సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయి వరద సమీపంలోని ఇళ్లలోకి చేరుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరువుల్లో ఇళ్లు నిర్మించుకునే వారి నుంచి నాయకులు, అధికారులు రూ.లక్షల్లో వసూలు చేసి నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చినట్లు ఫిర్యాదులున్నాయి. మార్కండేయ గుడి వద్దగల మత్తడి చెరువు(మల్యాల చెరువు) మత్తడిపైన కూడా భవన నిర్మాణాలు చేపట్టడం విశేషం. ఎఫ్‌టీఎల్ పరిధిలో దాదాపు 50 వరకు భవన నిర్మాణాలు జరిగినట్లు సమాచారం.

మల్యాల శివారులోని సూరప్ప చెరువు ప్రాంతంలో ఎఫ్‌టీఎల్ పరిధిలో పదుల సంఖ్యలో భవన నిర్మాణాలు జరిగాయి. చెరువులు, కుంటల ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన భవన నిర్మాణాలకు గ్రామపంచాయతీ అధికారులు అనుమతులు ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది. మండలంలోని కొండగట్టు ప్రాంతంలోని తుమ్మచెరువు, ముత్యపేట పరిధిలోని భీమన్న చెరువు, మారేడుకుంటలో కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జరిగినట్లు నీటిపారుల అధికారులు గుర్తించారు. కొండగట్టు ప్రాంతంలో చెరువుల్లోకి వరద నీరు వెళ్లడానికి పాత కాలువలను కూడా ఆక్రమించుకొని ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో రహదారులు, నివాసాలను వరద ముంచెత్తుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నోటీసులు జారీ చేశాం..**

మల్యాల మండల కేంద్రంలోని మత్తడి చెరువు, సూరప్ప చెరువుల్లోని ఎఫ్‌టీఎల్ పరిధిలో పలు భవన నిర్మాణాలు జరిగినట్లు మా పరిశీలనలో తేలింది. ఈ విషయమై 2023 నుంచి రెవెన్యూ, గ్రామపంచాయతీ అధికారులకు తెలియజేస్తున్నాం. సూరప్ప చెరువు ప్రాంతంలో ఎఫ్‌టీఎల్ ప్రాంతాన్ని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయాలని మండల రెవెన్యూ అధికారులను కోరినప్పటికీ సర్వేయరు అందుబాటులో లేరన్న కారణంతో హద్దులు ఏర్పాటు చేయలేదు. కొండగట్టు, ముత్యంపేట గ్రామ శివారులోని చెరువులు, కుంటల్లో కూడా అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు తేలడంతో గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో నోటీసులు కూడా జారీ చేశారు. – తిరుపతి, డిప్యూటీ ఇంజినీరు, నీటిపారుదల శాఖ, జగిత్యాల

**కొత్తగా అనుమతులు ఇవ్వడం లేదు**

చెరువులను సంరక్షించుకుంటేనే భవిష్యత్తు తరాల వారికి మేలు జరుగుతుంది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై చర్యలకు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. చెరువులను పూడ్చివేస్తూ భవన నిర్మాణాలు చేపట్టడంవల్ల వరదలు జనావాసాలను ముంచెత్తుతూ తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఐబీ అధికారుల ఆదేశాల మేరకు చెరువుల్లో నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు కూడా జారీ చేశాం. కొత్తగా ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంలేదు. హైడ్రా తరహాలో గ్రామాల్లోని చెరువుల పరిరక్షణకు కూడా ప్రత్యేక ఏజెన్సీ ఏర్పాటైతే బాగుంటుంది.

– శ్రీకాంత్, ఈవో, మల్యాల మేజర్ గ్రామ పంచాయతీ

## ఊరిస్తున్న ఎమ్మెల్సీ పదవి!

కరీంనగర్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ. పదవులు ఆశావహుల్ని ఊరిస్తున్నాయి. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన ఈ ఎన్నికలు త్వరలో జరిగే వీలుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీగా టి.జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కూర రఘోత్తంరెడ్డిల పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29తో ముగియనుంది. దీంతో ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే సెప్టెంబరు 30వ తేదీ నుంచి ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఓటరు నమోదు ప్రకియ కొనసాగించాలని ప్రకటన జారీ చేసింది. దీంతో ఆశావహ నాయకులంతా ఎవరికి వారుగా వారి ప్రయత్నాల్లో నిమగ్నమవుతున్నారు. ఇటు నాయకులు, ప్రముఖులు పట్టభద్రుల స్థానంపై కన్నేయ గా.. ఉపాధ్యాయ సంఘాల నేతలు కూడా వారికున్న పరిచయాలతో పదవి దక్కించుకునే ఎత్తుగడలకు సిద్ధమవుతున్నారు.. ప్రధాన పార్టీలు కూడా బలమైన అభ్యర్థులను ఖరారు చేయాలన్న ఆలోచనతో ఉన్నాయి..

**ఈసారి గట్టి పోటీ తప్పదా!**

ఈ రెండు స్థానాలకు గట్టి పోటీ ఉండనుందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. 2019 మార్చిలో జరిగిన ఎన్నికల్లో పట్టభద్రుల స్థానానికి 17 మంది పోటీ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన జీవన్‌రెడ్డి 39,430 ఓట్ల ఆధిక్యంతో అప్పటి తెరాస (భారాస) మద్దతు ప్రకటించిన చంద్రశేఖర్‌గౌడ్‌పై విజయం సాధించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఏడుగురు పోటీ చేయగా..1,707 ఓట్లతో రఘోత్తంరెడ్డి పాతూరి సుధాకర్‌రెడ్డిపై గెలుపొందారు. ఈ సారి కూడా ఈ రెండు స్థానాలకు అభ్యర్థులు పెరిగే అవకాశముంది. నాలుగు ఉమ్మడి జిల్లాల నుంచి పోటీ చేసే వారు ఎక్కువగా ఉండనున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి ఇప్పటి వరకు ఆశావహుల ప్రయత్నాలు ఇంకా ప్రారంభం కాలేదు. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి మాత్రం కాంగ్రెస్, భాజపా, భారాస పార్టీల తరపున రంగంలోకి దిగాలనుకునే వారు ఆయా పార్టీల ముఖ్యులను కలుస్తూ తమ పేరు పరిశీలనలో ఉంచుకోవాలని కోరుతున్నారు.

**పట్టభద్రుల స్థానానికి పలువురి పేర్లు**

పట్టభద్రుల స్థానంలో పోటీకి వివిధ పార్టీల నుంచి ప్రయత్నిస్తున్నట్లు కొంతమంది పేర్లు ప్రచారంలో ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ తరపున వెలిచాల రాజేందర్‌రావు, రోహిత్‌రావు, ప్రణవ్‌ల పేర్లు వినిపిస్తున్నాయి. మరోవైపు భారాస నుంచి రవీందర్‌సింగ్, శేఖర్‌రావుల పేర్లు భాజపా నుంచి గతంలో పోటీ చేసిన సుగుణాకర్‌రావు, రాణిరుద్రమలు ప్రయత్నిస్తున్నారని



ప్రచారం జరుగుతోంది. ఇతర జిల్లాల్లోనూ ఈ మూడు పార్టీల తరపున మరికొందరు ప్రయత్నాల్లో ఉన్నారని సమాచారం. వీరెవరూ ఇప్పటి వరకు బహిరంగంగా తమ ఆసక్తిని వెల్లడించకున్నా ఆయా పార్టీల్లో మాత్రం ప్రచారం జరుగుతోంది. వీరితోపాటు వివిధ రంగాలకు చెందిన కొత్తవారు కూడా ఈసారి పోటీకి సిద్ధమవుతున్నారు. ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేసిన కరీంనగర్‌కు చెందిన డాక్టర్ బీఎన్‌రావు తన ఫౌండేషన్ ద్వారా గ్రంథాల యాలకు ఉచితంగా పుస్తకాలు అందిస్తూ యువతను కలుస్తూ పోటీలో ఉంటాననే సంకేతాలు ఇస్తున్నారు. భారాసకు చెందిన ముఖ్య నేతలను ఈయన కలవడంతో ఆ పార్టీ మద్దతుతో పోటీకి సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే తరహాలో ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి కూడా బరిలోకి దిగడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆయన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు పలువురు నేతలను కలవడంతో ఆ పార్టీ మద్దతుతో పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న ప్రచారం ఉంది. ఈ విషయమై ఆయనతో మాట్లాడగా త్వరలో సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రకటిస్తానని చెప్పారు. వీరితోపాటు ప్రసన్న హరికృష్ణ అనే ప్రొఫెసర్ కూడా గ్రంథాల యాల వద్ద యువతను కలుస్తూ వారి మన్ననలు పొందే ప్రయత్నం చేస్తున్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన తరగతులు, ప్రత్యేక కార్యశాలలు నిర్వహిస్తూ తాను ఎమ్మెల్సీగా రంగంలోకి దిగుతానని యువత సహకారాన్ని కోరుతున్నారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమయ్యాక ఆశావహుల సంఖ్య, కార్యకలాపాలు మరింత పెరిగే అవకాశమున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

## నిధులివ్వరేం..!

నల్గొండ : గడియారం కేంద్రం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు రోడ్డు విస్తరణలో భాగంగా చేపట్టిన ఫుట్‌పాత్ నిర్మాణ పనుల చిత్రమిది. కలెక్టర్ బంగ్లా, మైసయ్య విగ్రహం ప్రాంతంలో టైల్స్ ఏర్పాటు చేయకుండానే అసంపూర్తితో మధ్యంతరంగా నిలిపివేశారు. గుత్తేదారుడికి బిల్లులు రాకపోవడంతో ఏడాది కాలంగా పనులు ఆగిపోయాయి. పట్టణాలకు నిధుల కొరత వెంటాడుతోంది. నల్గొండ జిల్లాలోని ఎనిమిది పురపాలికలకు పట్టణ ప్రగతి నిధులు నెలవారీగా రాకపోవడంతో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. ప్రతిపాదించిన పనులు కాగితాలకే పరిమితమవుతుండగా..పూర్తి చేసినవాటికి బిల్లులు రావడం లేదు. పట్టణాల్లో ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో సమానంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు జమ చేసి, ప్రతి నెల బిల్లులు చెల్లించేందుకు 2020లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రగతి పథకాన్ని తెరమీదకు తీసుకొచ్చింది. జనాభా ప్రతిపాదికన పట్టణాలకు రూ.20 లక్షల నుంచి రూ.1.60 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేశారు. తదుపరి పట్టణ ప్రగతి నిధుల్లో 25 శాతం కోత విధించారు. అయినా క్రమం తప్పకుండా నిధులను విడుదల చేయడం లేదు.

పురాలకు ఆస్తి, నల్లాకుళాయి పన్నుల ద్వారా రావాల్సిన ఆదాయం



అంతంత మాత్రంగానే ఉంటుంది. పట్టణాల అభివృద్ధి పట్టణ ప్రగతి నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు కీలకం, ఎస్‌డీఎఫ్, ఎమ్మెల్యేలు, ఎంపీ నిధులు గతంలో కేటాయించే వారు. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులు మినహా ఇతర నిధులు, గ్రాంట్లు రావడం లేదు.

ఆస్తి పన్నుల రూపంలో వచ్చిన నిధులు కార్మికుల వేతనాలు, కరెంటు బిల్లులు, పారిశుద్ధ్య వాహనాల నిర్వహణ వంటి వాటికే సరిపోవడం లేదు. ఇప్పటికే ఆయా పురపాలికల్లో నిధుల నిలుపుదలతో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. పాత పనులు చేసిన వారికి ఒక్కో పురపాలిక సుమారు రూ.5 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది.కొరత వాస్తవమే: ముసాబ్ అహ్మద్ సయ్యద్, కమిషనర్ నల్గొండ పురపాలికఏడాది కాలంగా పట్టణ ప్రగతి నిధులు రావడం లేదు. కేవలం ఆస్తి పన్నులు, 15వ ఆర్థిక సంఘం నిధులతోనే నెట్టుకొస్తున్నాం. ప్రతి నెల రూ.3.5 కోట్ల వరకు నిర్వహణ ఖర్చులు వస్తున్నాయి. కొత్తగా పనులు చేపట్టాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. పనులు పూర్తి చేసిన వారికి సుమారు రూ.15కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది.

## ఎంత కష్టం.. ఎంత నష్టం..?

ఖమ్మం: భారీ వర్షాలు, వరదలు ఖమ్మం జిల్లాను అతలాకుతలం చేశాయి. మున్నేరు విలయం అపార నష్టాన్ని మిగిల్చింది. నిలువనీడ లేక బాధిత కుటుంబాలు బోరుమంటున్నాయి. ఇంటిల్లిపాది రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంటలు దెబ్బతినటంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. పాఠ్యపుస్తకాలు, రాతపుస్తకాలు, ఇతర ధ్రువపత్రాలు నష్టపోయి విద్యార్థులు ఘొల్లుమంటున్నారు. జిల్లాలో రూ.417.69 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికార యంత్రాంగం ప్రాథమికంగా ప్రభుత్వానికి నివేదించింది. జిల్లాలో వరదల ధాటికి ఆరుగురు మృతిచెందినట్లు ప్రస్తావించింది. బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున సర్కారు పరిహారం అందజేసింది.

సాగునీటి పారుదల శాఖకు రూ.100 కోట్లు

జిల్లాలో 103 పనులకు నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. 45 చెరువులకు గండ్లుపడ్డాయి.అనేకచోట్ల కాల్వలు కొట్టుకుపోయాయి. ఎత్తిపోతల పథకాలు మునిగిపోయాయి. అత్యవసరంగా చేపట్టాల్సిన మరమ్మతులకు రూ.25 కోట్లు అవసరమని ప్రభుత్వానికి అధికారులు నివేదించారు. నీటిపారుదలశాఖకు మొత్తమ్మీద సుమారు రూ.100కోట్ల నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు.విద్యుత్తు సంస్థకు రూ.14.05 కోట్లు

జిల్లాలో 4,500 విద్యుత్తు స్తంభాలు, 600 నియంత్రికలు దెబ్బతిన్నాయి. 300 కి.మీ మేర తీగలు తెగిపోయాయి. 56 గ్రామాల్లో 300 వ్యవసాయ నియంత్రికలకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. మొత్తమ్మీద విద్యుత్తు సంస్థకు రూ.14.05 కోట్ల నష్టం వాటిల్లింది.

అన్నదాతలకు కోలుకోలేని దెబ్బజిల్లాలో 5,14,395 ఎకరాల్లో వివిధ పంటలు సాగవగా వీటిలో 79,914 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 54,045 మంది రైతులు నష్టపోయారు. వ్యవసాయ శాఖకు రూ.111.87 కోట్ల నష్టం వాటిల్లింది. 53,648 పశువులు చనిపోవటంతో రూ.1.16 కోట్ల నష్టం సంభవించింది. 3,500 టన్నుల చేపలు కొట్టుకుపోయాయి. మత్స్యశాఖకు రూ.4.29 కోట్లమేర నష్టం వాటిల్లింది.ఆర్‌అండ్‌బీ శాఖకు రూ.180.37 కోట్లు

జిల్లాలో 76 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయి. రూ.180.37 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికార యంత్రాంగం గుర్తించింది.ఇతర శాఖల వారీగా వాటిల్లిన నష్టం (రూ.కోట్లలో)

వైద్యం: 9.23
విద్య: 1.20
రెవెన్యూ: 0.30
పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు: 15,056
పూర్తిగా దెబ్బతిన్న గృహాలు: 146

జిల్లాలో వరుణుడి జోరు

కొత్తగూడెం జిల్లాలో 8.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నమోదైన వర్షపాతం (మి.మీ.లలో) వివరాలు... దుమ్ముగూడెం-17.3, కరకగూడెం-15.5, ఇల్లెందు-15.5, మణుగూరు-14.0, అశ్వాపురం- 13.5, ఆళ్లపల్లి-9.8, గుండాల-8.8, సుజాతనగర్-8.0, లక్ష్మీదేవిపల్లి-7.0, భద్రాచలం (గోదావరి బ్యాంక్)-6.8, చుంచుపల్లి-6.3, కొత్తగూడెం(పాత కొత్తగూడెం)-4.8, దమ్మపేట (మందలపల్లి)-3.8, టేకులపల్లి-3.5, జూలూరుపాడు-2.0, అశ్వారావుపేట-2.0, దమ్మపేట(మల్కారం)-2.0.

భారీ వర్షాలు, వరదల ధాటికి జరిగిన నష్టంపై ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందజేశాం. పూర్తిస్థాయిలో నష్టంపై సర్వే జరుగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలన్నింటినీ ఆదుకుంటాం. ముజమ్మిల్ ఖాన్, కలెక్టర్, ఖమ్మం

# ప్రాణం.. గాల్లో దీపం!

పరిగి: బీజాపూర్– హైదరాబాద్ జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. తెలంగాణ– కర్ణాటక రాష్ట్రాలను కలుపుతూ కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, పరిగి, పూడూరు మీదుగా వెళుతోంది. హైదరాబాద్ నుంచి కర్ణాటకలోని గుల్బర్గా, బీజాపూర్‌తోపాటు వికారాబాద్ జిల్లాకు వెళ్లేందుకు ఈ మార్గమే కీలకం. అనంతగిరి, కోట్‌పల్లి ఈ దారిలోనే ఉండటంతో రాకపోకలు అధికంగా సాగుతుంటాయి. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు ఇరుకు రహదారి కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళుతున్నారు. పూడూరు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు చనిపోయారు. పూడూరు మండలం మన్నెగూడ నుంచి కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ పరిధి బిచ్చాల్ వరకు మూడు వరుసల రోడ్డు ఉన్నా విభాగినులు, సూచికల్లేవు. పలుచోట్ల ప్రమాదకర మలుపులున్నాయి. జాతీయ



రహదారిగా ప్రకటించడంతోపాటు ప్రమాదకారిగానూ గుర్తించారు. సర్వే పూర్తయినా..రోడ్డు విస్తరణలో భాగంగా సర్వేలు నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారు. రహదారిపై మలుపుల తగ్గింపు, అండర్ పాస్‌లు నిర్మించేందుకు టెండర్లు దక్కించుకున్న సంస్థ పలుమార్లు సర్వేలు చేసింది. రోడ్డుకు ఇరువైపులా భారీ వృక్షాలను తొలగించడంలో అవరోధాలు ఏర్పడడంతో అధికారులు చిన్న మరమ్మతులతో సరిపెట్టాల్సి వస్తోంది.

# క్షణికావేశం.. జీవితాలు బలి

హైదరాబాద్: ప్రేమ, కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు... కారణమేదైనా కొందరు ఆత్మహత్యే శరణ్యంగా భావిస్తున్నారు. నగరంలో కొన్ని రోజులుగా వరుస ఆత్మహత్యలు కలకలం రేపుతున్నాయి. బలవన్మరణాలకు ఎక్కువగా ఆర్థిక సమస్యలు, ఒత్తిడి భరించలేకపోవడం కారణంగా ఉన్నాయి. తాజాగా హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో నష్టపోయిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీన్ని భరించలేక అతని తల్లి ఆత్మహత్యకు యత్నించారు. నార్సింగి ఠాణా పరిధిలో ఓ మహిళ మూడేళ్ల కూతురితో 18వఅంతస్తు నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడ్డారు.

సమస్య చిన్నదైనా..: యుక్త వయసులో పలువురు ఒత్తిడి తట్టుకోలేకపోవడం, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. సమస్య చిన్నదే అయినా కొందరు తీవ్రంగా ఆలోచిస్తుంటారు. ఆత్మహత్యలకు ప్రధానంగా మూడు కారణాలుంటాయని వైద్యులు చెబుతున్నారు. వ్యక్తిగత నేపథ్యంతో పాటు మానసిక, సామాజిక పరిస్థితులు విపరీత ప్రభావం చూపిస్తాయి. వృత్తిపరమైన ఒత్తిడి, ఆర్థిక పరిస్థితులు, జీవితంలో జరిగే కొన్ని ఘటనలు, సొంతమని భావించే వ్యక్తుల అకాల మరణంతో ఒక్కసారిగా మనోవేదన ప్రారంభమవుతుంది. మరణం తప్ప మరోదారి లేదనే భావనతో ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు. నగరంలో 10 రోజుల్లో ఏకంగా 20 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు.రోడ్డు ప్రమాదాల్లో 15–29 ఏళ్ల మధ్య వయసున్న యువత ఎక్కువగా మరణిస్తుండగా రెండో స్థానంలో ఆత్మహత్యలుండడం కలవరపెడుతోంది. 90 శాతం నివారించొచ్చు..

బాధితుల ప్రవర్తన గుర్తిస్తే ఆత్యహత్యల్లో 90 శాతం నివారించొచ్చని మానసిక వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు వారు పలు సూచనలు చేస్తున్నారు.

ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు కుటుంబసభ్యులు, సహచరులతో ప్రవర్తన కొత్తగా ఉంటుంది.

ఒంటరిగా ఉంటారు. ఇతర ప్రాంతాలు, వేడుకలు, కార్యక్రమాలకు వెళ్లేందుకు ఇష్టపడరు.

కొందరు తాము జీవించి లాభం లేదంటూ తరచూ బాధపడుతుంటారు.

కుటుంబ సభ్యులకు భారంగా మారామని ఆవేదన చెందుతారు.

ఇష్టమైన పనులు చేయలేరు.

కుటుంబం, స్నేహితులకు దూరంగా ఉంటారు. ఖరీదైన వస్తువులను దానం చేస్తుంటారు.

పని అప్పజెబితే నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తారు. దేన్నీ తీవ్రంగా పరిగణించరు.

డ్రగ్స్, మద్యం విపరీతంగా తీసుకోవడం ఒక లక్షణం.

నిరాశలో ఉంటూ చిరాకు పడుతుంటారు. సందేహం అనిపిస్తే వెంటనే వైద్యులకు చూపించాలి.

బాధితులను ఓదార్చాలి..

'కొందరు సమస్యను ధైర్యంగా ఎదుర్కోకుండా మానసిక ఒత్తిడితో ఆత్మహత్యకు పాల్పడుతుంటారు. సమస్యల్లో ఉన్నవారిని ఓదారుస్తూ వారితో ఎక్కువ మాట్లాడేందుకు ప్రయత్నించాలి. ధైర్యం చెప్పి ఆలోచనలు మళ్లించాలి. సకాలంలో స్పందించడం అవసరం.

–డాక్టర్ నాగభైరవి, మానసిక వైద్య నిపుణులు

# కూడళ్లు మెరవాలి.. నగరం మురవాలి

హైదరాబాద్: నగర వాతావరణం ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే పైవంతెనలు, విభాగినులకు రంగులద్దే కార్యక్రమం మొదలైంది. పైవంతెనల కింద ఖాళీస్థలాన్ని పార్కులుగా తీర్చిదిద్దుతున్నారు. పలు కూడళ్లలో రంగురంగుల విద్యుద్దీప కాంతులతో ఆకట్టుకునేలా ఫౌంటెయిన్లను అభివృద్ధి చేయనున్నారు. కొత్త ఆకృతులతో..గచ్చిబౌలి ఓఆర్‌ఆర్ వద్ద బస్టాప్, శేరిలింగంపల్లి జోన్‌లో అన్నపూర్ణ భోజన కేంద్రాలు, కొత్తగూడ పైవంతెన కింద మహిళా శక్తి క్యాంటీన్, ఐకియా కూడలిలో పబ్లిక్ ప్లాజా నిర్మాణానికి శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం డిజైన్లు రూపొందిస్తోంది .అబిడ్స్‌లోని ప్రధాన తపాలా కార్యాలయం ముందున్న నెహ్రూ కూడలిలో పొడవైన ఫౌంటెయిన్‌ను నిర్మించనున్నారు. నెహ్రూ విగ్రహాన్ని మపాత వాటిపైనా దృష్టిపెట్టాలిరింత ప్రకాశింపజేసేలా విద్యుద్దీపాలను ఏర్పాటుచేసి.. కూడలిని విస్తరించి తొమ్మిది ఫౌంటెయిన్లు ఏర్పాటు చేయాలన్నది ప్రణాళిక. తపాలాశాఖ కార్యాలయాన్ని ప్రతిబింబించే పోస్టుబాక్సు నమూనాఏర్పాటు చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

నారాయణగూడ కూడలిలో మార్కెట్ వైపున్న విభాగినిపై, ట్యాంక్‌బండ్ అంబేద్కర్ కూడలి, సచివాలయం ఎదురుగా, లక్డీకపూల్ కూడలిలోనూ ఈ తరహా నిర్మాణాలు చేపట్టనున్నట్టు జీహెచ్‌ఎంసీ చెబుతోంది. చార్మినార్ గుల్జార్ హౌజ్ కూడలి, ఇతరత్రా ప్రాంతాల్లోని ఫౌంటెయిన్లను పునరుద్ధరించాలని, చారిత్రక కట్టడాలు, రద్దీ ప్రాంతాల్లో మరిన్ని నిర్మించాలని నగరవాసులు కోరుతున్నారు.

# ఐటీఐలకు సాంకేతిక సొబగులు



పెద్దపల్లి : పోటీ ప్రపంచంలో నైపుణ్యం ఉంటేనే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చాక ఆదరణ కోల్పోయిన ఐటీఐలకు పునర్వైభవం తెచ్చే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వాటిని అధునాతన సాంకేతిక కేంద్రాలు(అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్లు)గా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఈ ఏడాది నుంచి కొత్తగా ప్రవేశపెట్టే ఆరు కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నైపుణ్య లేమితో అవకాశాలు కోల్పోతున్న విద్యార్థులకు ఈ కేంద్రాలు బాసటగా నిలవనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన 65 ఐటీఐల్లో పెద్దపల్లి, రామగుండం పారిశ్రామిక శిక్షణ కేంద్రాలకు చోటు దక్కింది.

ఈ ఏడాది నుంచే ప్రవేశాలు

విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు ఆరు ఆధునిక కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్టీసియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వెరిఫైర్, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్స్ కోర్సుల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇప్పటివరకు ఐటీఐలో ఫిట్టర్ ఎలక్ట్రిషియన్, వెల్డర్, మెటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్ తదితర కోర్సుల్లో పెద్దగా అవకాశాలు దక్కడం లేదు. దీంతో ఆధునిక సాంకేతిక కోర్సుల్లో విద్యార్థులకు మెరుగైన నైపుణ్యాలు అందనున్నాయి.

కోర్సు ముగియగానే ఉద్యోగంనైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందనుంది. ప్రస్తుతం టాటా కంపెనీ ఆరేళ్ల వరకు కోర్సు నిర్వహణ బాధ్యత తీసుకుంది. తర్వాత గడువు పొడిగించనున్నారు. కోర్సు పూర్తి చేసిన వెంటనే అప్రెంటిస్‌షిప్ కల్పిస్తారు. కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు లభించనున్నాయి. ప్రస్తుతం కృత్రిమ మేధ(ఏఐ)కు ఆదరణ కనిపిస్తున్న నేపథ్యంలో ఐటీఐల్లో కొత్త కోర్సులను అందుబాటులోకి తెచ్చారు.

రూ.4.77 కోట్లతో భవనం

అధునాతన సాంకేతిక కేంద్రాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది.

పెద్దపల్లి ఐటీఐ ఆవరణలో రూ.4.77 కోట్లతో నూతన భవన సముదాయాన్ని నిర్మిస్తున్నారు.

ఇప్పటికే కోర్సులకు సరిపడా కొన్ని యంత్రాలు వచ్చాయి. మిగిలినవి కూడా త్వరలో రానున్నాయి.


కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు యంత్రాలను సిద్ధం చేస్తున్నారు.

ఇప్పటివరకు ఐటీఐలు పూర్తి చేసిన విద్యార్థులు కూడా కొత్త కోర్సుల్లో ప్రవేశాలు తీసుకోవచ్చు.

172 సీట్లకు అనుమతి

కొత్తగా ప్రవేశపెట్టిన ఆరు కోర్సులతో విద్యార్థుల్లో మెరుగైన నైపుణ్యాభివృద్ధి సాధ్యమవుతుంది. శిక్షణ పూర్తి చేస్తే కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు దొరుకుతాయి. ఆరు కోర్సుల్లో మొత్తం 172 సీట్లకు అనుమతి ఉంది.వెంకట్‌రెడ్డి, పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్

# ఉన్నవి కూల్చి.. కొత్తవి నిర్మించక



గంభీరావుపేట : రహదారి విస్తరణ పేరుతో మండల కేంద్రం గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీలో పలు నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. తిరిగి వాటిని నిర్మించలేదు. మరోవైపు రహదారి విస్తరణ చేపట్టలేదు. దీంతో ఉన్న సమస్యలకు కొత్తవి తోడయ్యాయి. ఫలితంగా ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీ పాలకవర్గం ఉన్న సమయంలో గాంధీచౌక్ వద్ద ఉన్న మార్కెట్ షెడ్‌ను, పాత గ్రామ పంచాయతీ భవనం కూల్చివేశారు. సమీకృత మార్కెట్ నిర్మిస్తామని అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా భూమిపూజ చేశారు. ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. కూరగాయలు అమ్మేవారు, కొనేవారు ఎండలో, వానలో ఇబ్బందులు పడుతున్నారు.

ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా మినీ బస్టాండ్, మూత్రశాలలు, దోశలగూడెం వద్ద బీఎస్ఎన్ఎల్ టవర్‌కు సంబంధించిన ప్రహరీ, దోశలగూడెం ప్రాథమిక పాఠశాల ప్రహరీ కూల్చివేశారు. తిరిగి వాటిని నిర్మించలేదు. రహదారి విస్తరణ చేపట్టలేదు. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలకు ప్రహరీ లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.పంచాయతీ కార్యాలయం వద్ద కాంప్లెక్స్, మూత్రశాలలు నిర్మించి ఏడాది దాటింది. మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభించి దాదాపు తొమ్మిది నెలలు అవుతున్నా వాటిని వినియోగంలోకి తీసుకురావటం లేదు. ఇటీవల కాంప్లెక్స్‌లో ఉన్న నాలుగు గదులను వేలం వేశారు. ఇందులో దక్కించుకున్న వారికి పంచాయతీ అధికారులు అప్పగించడం లేదు. అదేవిధంగా మేజర్ గ్రామ పంచాయతీకి, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు నిత్యం పనుల మీద చాలా మంది వస్తుంటారు. మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నవి వినియోగంలోకి తీసుకురావడం లేదు.

ప్రధాన రహదారిలో బస్టాండ్ వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. చినుకులు పడితే చిత్తడిగా మారుతుంది. మరమ్మతులు చేపట్టడం లేదు.రెండు శుద్ధజల కేంద్రాలు ఉన్నా నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి.చాలా చోట్ల పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది. అయినా పట్టించుకోవడం లేదు.గత ప్రభుత్వం ప్రధాన రహదారి విస్తరణకు రూ. 30 కోట్లు మంజూరు చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. దీంతో రోడ్డు విస్తరణ కలగా మిగిలింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధిలో వెనకబడింది

పంచాయతీ అధికారులు సమస్యలను పరిష్కరించాలి. మార్కెట్ షెడ్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నది కూల్చారు. చాలా చోట్ల మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. రోడ్డు విస్తరణ కాలేదు. అభివృద్ధిలో గంభీరావుపేట వెనకబడిపోతుంది.

జీడి హరీశ్, గంభీరావుపేట

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

మేజర్ గ్రామ పంచాయతీలోని సమస్యలను పంచాయతీకి వచ్చే నిధులతో అయ్యే వాటిని పరిష్కరిస్తున్నాం. అధిక నిధులు అవసరమున్న వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. బస్టాండ్ వద్ద ఉన్న గుంతలను త్వరలోనే పూడ్చివేస్తాం. అపరిశుభ్రంగా ఉన్న చోట శుభ్రం చేస్తాం. పంచాయతీకి వచ్చే నిధులను బట్టి గ్రామంలో అభివృద్ధి పనులపై దృష్టి పెడతాం.రాజేశ్వర్, ఎంపీవో


# ఈ సారైనా 'దిశా'నిర్దేశం చేస్తారా..?

కొత్తగూడెం : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల అమలుపై జిల్లాలో పర్యవేక్షణ కొరవడుతోంది. ఏటా సాధించాల్సిన లక్ష్యాలు నీరుగారుతున్నాయి. ఈ పరిస్థితిని గాడిన పెట్టాల్సిన పాలనా యంత్రాంగం ఒక 'దిశ' లేకుండా ముందుకు సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు పది నెలల విరామం తర్వాత నేడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో 'దిశ' కమిటీ సమావేశమవుతోంది. కనీసం తీర్మానాంశాల అమలుపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు. 2020లో జరిగిన సమావేశంలో సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి 72 అంశాలపై తీర్మానం చేశారు. ఆయా లక్ష్యాల సాధనపై పెద్దగా దృష్టిసారించిన దాఖలాల్లేవు. ఆ తర్వాత కరోనా విజృంభణతో రెండేళ్ల పాటు కమిటీ సమావేశమవలేదు. తిరిగి 2022 నవంబరు 26న సమావేశం నిర్వహించారు. అంతకుముందు తీర్మానాలకు సంబంధించి పలు సమస్యలను పరిష్కరించినట్లు అధికారులు శాఖల వారీ లెక్కలు చెప్పినా.. క్షేత్రస్థాయిలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని స్థానిక ప్రజాప్రతినిధులు వాడీ వేడి చర్చకు తెరలేపారు. చివరిసారిగా 2024 జనవరి 25న అప్పటి మహబూబాబాద్ ఎంపీ మాళోత్ కవిత అధ్యక్షతన దిశ కమిటీ సమావేశమైంది. 42 అంశాలపై ప్రగతి నివేదికలను వివిధ శాఖల అధికారులు పొందుపరిచారు. తదనంతరం జరిగిన చర్చలో పలు పథకాల అమలు తీరుపై ప్రజాప్రతినిధులు పెదవి విరిచారు. వారు లేవనెత్తిన సమస్యలపై పెద్దగా స్పందన లేదని విమర్శలు గుప్పించారు. ప్రధానంగా రైల్వే శాఖపై జరిగిన చర్చలో ఇల్లెందులో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపించింది. దీనిపై ఎలాంటి స్పందన లేదు. వైద్యారోగ్య శాఖలో అప్పటి నుంచి ఇప్పటివరకు మందుల కొరత వేధిస్తూనే ఉంది. డయాలసిస్ కేంద్రాలను పెంచాలన్న లక్ష్యంలో కొంత పురోగతి కనిపించినా.. రక్తశుద్ధి సేవలకు కిడ్నీ రోగులు నిరీక్షిస్తూనే ఉన్నారు. మరిన్ని యూనిట్లు పెంచితే తప్ప ఊరట కలిగేలా లేదు. ఏజెన్సీలో వివిధ శాఖల్లో ఉద్యోగాల భర్తీపైనా గతంలో చర్చ లేవనెత్తారు. దివ్యాంగులకు సదరం ధ్రువపత్రాల జారీ ఓ ప్రహసనంగా మారింది. దీనికి సరైన పరిష్కారం చూపాల్సి ఉంది. పీఎం గ్రామీణ సడక్ యోజన, గిరివికాస్ పథకం, మారుమూల గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్తు సౌకర్యం, ఏజెన్సీల్లో సెల్‌టవర్ల ఏర్పాటు ద్వారా నెట్‌వర్క్ విస్తరించాలనే అంశాలపై మరింత దృష్టిసారించాలనే డిమాండ్ ప్రస్తుతం కూడా వినిపిస్తోంది. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలను పథకాల అమలుతో పటిష్ఠపరచాలని మన్యం ప్రజలు కోరుతున్నారు.

మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ప్రారంభంజిల్లా దిశ కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ అధ్యక్షతన శనివారం జరగనుంది. మధ్యాహ్నం 3 గంటల కు ప్రారంభం కానున్న ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు, సదుపాయాల కల్పన తీరుపై సమీక్షించనున్నారు. శాఖల వారీగా సమగ్ర సమాచారంతో అధికారులు హాజరుకానున్నారు. గత సమావేశంలో రైల్వే అధికారులు అసమగ్ర సమాచారంతో హాజరవటంపై అసంతృప్తి వ్యక్తమైంది. ఇలా తూతూమంత్రంగా కాకుండా జిల్లా అభివృద్ధికి బాటలు వేసే నిర్మాణాత్మక చర్చలో అధికారులను భాగస్వాములు కావాలన్నది ప్రజలు, ప్రజాప్రతినిధుల ఆకాంక్ష. ఇటీవల స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల పదవీ కాలం పూర్తయినందున వారు సమావేశానికి హాజరయ్యే అవకాశం లేదు. ఖమ్మం లోక్‌సభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, జిల్లా ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.

# ప్రమాదాల లెక్క.. తగ్గించాలి పక్కా

హైదరాబాద్:మెట్రో నగరాలు, జాతీయ రహదారులపై పెరుగుతున్న ప్రమాదాలను తగ్గించాలంటే రహదారి భద్రత గణన (రోడ్‌సేఫ్టీ ఆడిట్) నిర్వహించాలని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని పట్టణ పర్యావరణ అధ్యయన ప్రాంతీయ కేంద్రం పరిశోధక బృంద సభ్యులు నిర్ధారించారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబయిల్లో ఈ 9 నెలల్లో ప్రమాదాల సంఖ్య పెరిగిందని, వీటిని నియంత్రించపోతే పెరిగే అవకాశాలున్నాయని హెచ్చరించారు. రెండేళ్లలో మెట్రో నగరాలలోని రహదారులు, వాటికి సమీపంలోని జాతీయ రహదారులపై నమోదైన ప్రమాదాలను విశ్లేషించారు. నిర్వహణ లోపాల కారణంగా 40 శాతం జరుగుతున్నాయని గుర్తించారు. రోడ్ సేఫ్టీ ఆడిట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించి చర్యలు చేపడితే రోడ్డు ప్రమాదాలను 10 నుంచి 20 శాతానికి తగ్గించవచ్చని పట్టణ పర్యావరణ అధ్యయన ప్రాంతీయకేంద్రం సంచాలకులు ప్రొఫెసర్ కుమార్ తెలిపారు. రహదారుల నిర్మాణం... వాహనాల రాకపోకలు: ప్రమాదాలు తగ్గించేందుకు రహదారుల నిర్మాణం, వాహనాల రాకపోకలపై సమగ్ర సమాచారం ఉండాలి. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) మార్గదర్శకాలకు అనుగుణంగా వాహనాల రాకపోకల పెరుగుదలను అంచనా వేసి అత్యాధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణంలో వినియోగించాలి. హైదరాబాద్–విజయవాడ, హైదరాబాద్–బెంగళూరు జాతీయ




రహదారుల నిర్మాణ సమయంలో, అందుబాటులోకి వచ్చాక లెక్కలన్నీ మారిపోయాయి. పండగ సెలవులొస్తే చాలు అన్ని టోల్‌గేట్ల వద్ద విపరీతమైన రద్దీ ఉంటోంది. దీంతో రహదారులపై ఒత్తిడి పెరిగి తరచూ ప్రమాదాలు నమోదవుతున్నాయి.

లెక్కల గణనలో అన్ని వివరాలు..

జాతీయ, రాష్ట్ర రహదారులపై చోటుచేసుకుంటున్న ప్రమాదాలపై ఉస్మానియా విశ్వవిద్యాలయం పట్టణ, పర్యావరణ అధ్యయన ప్రాంతీయ కేంద్రం పరిశోధక బృంద సభ్యులు అధ్యయనం చేశారు. నగరంలోని రహదారులు, బాహ్యవలయ రహదారి, హైదరాబాద్–విజయవాడ, హైదరాబాద్–బెంగళూరు రహదారులపై సైన్‌బోర్డులు, రేడియం బోర్డులు కొన్ని ప్రాంతాల్లో లేవని గుర్తించారు. హైదరాబాద్–విజయవాడ రహదారిపై రాత్రివేళల్లో ట్రక్కులు, లారీలను నిలపడంతో వాహనదారులు వాటిని గమనించక ఢీకొడుతున్నారన్నారు.

ప్రయోజనాలు... నియంత్రణ

రహదారి భద్రతను సమీక్షించే ఆడిట్ వ్యవస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద లేదు. జాతీయ రహదారి నిర్వహణ సంస్థ అధికారులు కొన్ని మార్గాల్లో వీటిని ఏర్పాటు చేయాలి.

ఈ ఆడిట్‌ను పర్యవేక్షించే అధికారులు జాతీయ, రాష్ట్ర రహదారుల మరమ్మతులపై ఎప్పటికప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికలను సమర్పించేందుకు వీలుంటుంది. నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది.

ఆడిట్ ద్వారా ఒక రహదారిపై ఎన్ని ప్రమాదాలు జరిగాయి? ఎందుకు జరిగాయి? తెలిస్తే ప్రమాదాలు తగ్గించే వీలుంటుంది.

# అయ్యో రామా.. ఎన్నాళ్లిలా..?

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాధికారులు, ఉద్యోగుల మధ్య అగాధం ఏర్పడుతోంది. అధికారుల నిర్ణయాలు సరిగ్గానే ఉంటాయంటున్నా.. కొన్నిసార్లు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. ఆంజనేయస్వామి, లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయాలకు సిబ్బంది సరిపడా లేరనే కారణంతో గురువారం కొన్ని గంటల పాటు తాళాలు వేసి ఉంచటం వివాదాస్పదమైంది. సర్దుబాటు చేసే పరిస్థితి ఉన్నా కావాలనే కొందరు ఉద్యోగులు ఈ తతంగం నడిపించారని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈవిషయంపై అదేరోజు సాయంత్రం ఈఓ రమాదేవి తమ ఉద్యోగులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సమావేశ క్రతువును వీడియో తీయించారంటే ఇక్కడ నెలకొన్న అపనమ్మకాలు ఏస్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ధర్మకర్తల మండలి ఏర్పడితే పాలకవర్గ సభ్యులు చొరవ తీసుకునే వీలుంటుంది. ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా ప్రభుత్వంతో చర్చించవచ్చుననే వాదనలు వ్యక్తమవుతున్నాయి.

అభివృద్ధిపై అడుగు పడాలంటే..రామాలయ అధికారులు చురుగ్గా వ్యవహరిస్తుండటంతో గతేడాది రూ.80కోట్లు ఉన్న ఆదాయం ఈసారి రూ.100 కోట్లకు చేరుకునే వీలుంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించటంతో భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కసరత్తు చేస్తోంది. నిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకు రూ.60.20కోట్లు కేటాయించింది. రూ.కోటితో కల్యాణమండపం వద్ద శాశ్వత షెడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇలాంటి కీలక సమయంలో వివాదాలు తగవని భక్తులు చెబుతున్నారు. సమన్వయలోపం తలెత్తకుండా ఈఓ, వైదిక బృందం చొరవ చూపాలని కోరుతున్నారు. కలహాలు తీరేనా..?ఇటీవల ఆలయ ప్రధానార్చకుడు, అతడి కుమారుడు కుటుంబ కలహాలతో రచ్చకెక్కాల్సి వచ్చింది. వీరిద్దరిపై కేసు నమోదు కావటంతో సస్పెండయ్యారు. ఇటీవల ఇద్దరు వైదిక పెద్దలు దసరా ఉత్సవాలకు తిరుపతి వెళ్లి ప్రవచనాలిచ్చారు. సెలవు తీసుకోకుండా ఎలా వెళ్తారని వీరికి ఈఓ మెమోలు జారీ చేశారు. ఓ అర్చకుడు ఇక్కడ విధులకు హాజరవకుండా వేరే దేశం వెళ్లారు. అతడిని విధుల నుంచి తొలగించారు. క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నా ఆస్థాయిలో పోస్టులను భర్తీ చేయటం లేదు.

ఇక్కడి అవసరాల నిమిత్తం సిబ్బంది సంఖ్య పెంచాలి. 36 మంది వైదిక సిబ్బంది సేవలందించాల్సి ఉంది. పరిచారక పోస్టులను భర్తీ చేయకపోవటంతో తీర్థప్రసాదాల పంపిణీ భారంగా మారుతోంది. ఈతరహా సమస్యలకు మూలాలు తెలిసిన వైదిక పెద్దలు వీటిని పరిష్కరించేందుకు చొరవ చూపటం లేదు. గొడవలు వచ్చినా అంతర్గత ఆలయాలను మూసే పరిస్థితి రాకుండా చూడాలి.

# స్వయం ఉపాధికి చేయూత

తిమ్మాపూర్ : గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగులకు ఎస్‌బీఐ ఆర్‌సెటి అండగా నిలుస్తోంది. అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించడంతోపాటు వ్యాపార సాధన నైపుణ్యాలను పెంపొందిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. ఈ ఉచిత శిక్షణ ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగులకు లబ్ధి చేకూరనుంది.

30 రోజులపాటు.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని మహాత్మానగర్‌లో 2010 సంవత్సరంలో నెలకొల్పిన ఎస్‌బీఐ ఆర్‌సెటి (గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ)లో ఈ నెల 23 నుంచి కంప్యూటర్ ట్యాలీ కోర్సుపై 30 రోజుల ఉచిత శిక్షణ ప్రారంభమవుతుంది. ఆసక్తి గల ఉమ్మడి జిల్లాకు చెందిన గ్రామీణా ప్రాంతాల (18 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన) పురుషులు ఎస్సెస్సీ మెమో, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు,




బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్‌లతో ఈ నెల 22వ తేదీ లోపు సంస్థలో సంప్రదించాలి. కంప్యూటర్ ట్యాలీ కోర్సుకు 30 రోజుల వరకు శిక్షణ తరగతులు ఉంటాయి. శిక్షణ కాలంలో ఉచిత భోజనంతోపాటు ఉచిత వసతిని అందిస్తారు.

యువత సద్వినియోగం చేసుకోవాలి

– డి.సంపత్, సంస్థ, డైరెక్టర్ సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందించడంతోపాటు నైపుణ్యాలను మెరుగుపర్చేలా కృషి చేస్తున్నాం. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ అనంతరం ధ్రువపత్రాన్ని అందజేయడంతోపాటు వ్యాపార రంగానికి సంబంధించిన రుణాన్ని బ్యాంకు ద్వారా అందజేస్తున్నాం.

# చెత్తపాలవుతున్న వాహనాలు

వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడ పురపాలక సంఘం పరిధిలో రోజూ చెత్త సేకరించే వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో వాటి ప్రభావం చెత్త సేకరణపై పడుతుంది. మరోవైపు పట్టణంలో పారిశుద్ధ్య సమస్య నెలకొని జనం ఇబ్బందులు పడుతున్నారు.

పురపాలక సంఘంలోని మొత్తం 28 వార్డుల్లో చెత్త సేకరణకు 20 వాహనాలతో పాటు మరో ఆరు ట్రాక్టర్లు ఉన్నాయి. ఇప్పటికే మూడు వాహనాలు పూర్తిగా పనికి రాకుండా పోగా మరో మూడు మరమ్మతులకు గురి కావడంతో షెడ్డులో పెట్టారు. దీంతో పట్టణంలో రోజూ చెత్త సేకరణకు వాహనాల కొరత ఏర్పడింది.

పట్టణంలోని రెండు చిన్న వార్డులకు ఒకటి, పెద్ద వార్డుకు ఒకటి చొప్పున వాహనాలను తిప్పుతున్నారు. వీటి ద్వారా రోజుకు భారీ ఎత్తున చెత్త సేకరణ చేపడుతున్నారు.

వాహనాల కొరత కారణంగా కొన్ని వార్డుల్లో రోజు విడిచి రోజు చెత్త సేకరణకు వస్తున్నట్లు పలు వార్డుల ప్రజలు చెబుతున్నారు.

మున్సిపల్‌లోని చెత్త వాహనాలను దాదాపు అయిదేళ్ల క్రితం కొనుగోలు చేశారు. దీంతో అవి తరచూ మరమ్మతులకు గురవుతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు.

చెత్త వాహనాలు నడిపేందుకు డ్రైవర్లు లేకపోవడం మరో కారణంగా కనిపిస్తోంది. పారిశుద్ధ్య సిబ్బందిలో డ్రైవింగ్ వచ్చిన కొందరు వాటిని నడుపుతున్నారు. డ్రైవర్లను నియమించి నిర్వహణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

లాడ్జీలు, దుకాణదారుల ఇష్టారాజ్యం

పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి దుకాణదారులు, లాడ్జీల ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్య ఎక్కువగా ఉంటుంది. ఇష్టారాజ్యంగా



చెత్త, అట్టలు, కాగితాలను దుకాణాల ముందు, రోడ్లపై వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మురుగు కాలువల్లో చెత్త, ఇతర వ్యర్థాలను వేస్తుండటంతో మురుగు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దోమలు, ఈగల బెడద పెరుగుతుంది. ఇటువంటి వారిపై మున్సిపల్ అధికారులు నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు. దీంతో మళ్లీ యథేచ్ఛగా వేస్తున్నారు.

ప్రధాన రోడ్డులో రెండుసార్లు...

వేములవాడ ఆధ్యాత్మిక పట్టణం కావడంతో రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో రోడ్లపై చెత్త దర్శనమిస్తుంది.

ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య సిబ్బంది తొలగించినప్పటికీ తిరిగి చెత్త దర్శనం ఇవ్వడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

రాజన్న ఆలయ పరిసరాలు, పట్టణంలోని ప్రధాన రహదారి, పోలీస్ స్టేషన్ నుంచి కోరుట్ల వైపు బస్టాండ్ వరకు రోజూ ఉదయం, రాత్రి వేళల్లో చెత్త సేకరిస్తున్నప్పటికీ మళ్లీ అక్కడక్కడ దర్శనమిస్తుంది.

పారిశుద్ధ్య సిబ్బంది సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు.

పారిశుద్ధ్య లోపం లేకుండా చర్యలు

చెత్త వాహనాలు మరమ్మతులకు గురైనప్పటికీ పట్టణంలో పారిశుద్ధ్యం లోపించకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. దుకాణాలు, లాడ్జీల వద్ద చెత్త వేసే వారికి జరిమానా విధిస్తున్నాం. పట్టణానికి సరిపడా పారిశుద్ధ్య సిబ్బంది లేరు. ఉన్నవారితోనే పనులు చేయిస్తున్నాం. సమస్య ఉన్న ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో చెత్త వాహనాలతో సేకరిస్తున్నాం. చెత్త సమస్యపై ఎక్కడి నుంచి ఫిర్యాదులు రాలేదు.

కిరణ్‌కుమార్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, వేములవాడ

# అత్యవసరానికి ఇబ్బందే!




జగిత్యాల : బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణంగా జగిత్యాలను తీర్చిదిద్దేందుకు బల్దియా 2022లో పట్టణ ప్రగతి నిధులు రూ.48 లక్షలు వెచ్చించి శౌచాలయాలను ఏర్పాటు చేసింది. కరీంనగర్‌రోడ్డులో తితిదే స్థలం, రిజిస్ట్రారు కార్యాలయం, అటవీశాఖ కార్యాలయం, పాతబస్టాండు, ఎడ్ల అంగడి, మహిళా డిగ్రీ కళాశాల పక్కన, మంచినీళ్లబావి ప్రాంతాల్లో వీటిని నిర్మించారు. టీఎల్ఎఫ్(టౌన్‌లెవల్ ఫెడరేషన్)కు ఒక్కో శౌచాలయం నిర్వహణకు రూ.10 వేల చొప్పున కేటాయించి వాటి బాధ్యత అప్పగించారు. ఉదయం, సాయంత్రం నిర్ణీత వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆదేశాలున్నాయి. పట్టణానికి వచ్చే వేలాది మందికి ఉచితంగా వినియోగించుకునే అవకాశం కల్పించారు.

ఆర్భాటంగా ప్రారంభం..

శౌచాలయాలను బల్దియా అధికారులు ఆర్భాటంగా ప్రారంభించారు. పూర్తిస్థాయిలో పనులు పూర్తి కాకముందే ప్రారంభించి వెంటనే తాళాలు వేయడంతో 6 నెలలకుపైగా వినియోగానికి నోచుకోలేదు. మరోవైపు కొన్నింట్లో నిర్మాణ లోపాలు తలెత్తాయి. దీనిపై సర్వత్రా విమర్శలు తలెత్తడంతో గతేడాది పురపాలక ఆమోదంతో మరమ్మతు చేసి మళ్లీ వినియోగంలోకి తెచ్చారు. రెండు శౌచాలయాలను వివిధ కారణాలతో ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. అటవీశాఖ ముందున్న శౌచాలయాన్ని ఎస్‌కెఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఏర్పాటు చేశారు.

అన్నింటినీ మూసేశారు..

పట్టణంలోని 6 శౌచాలయాలను 10 నెలల నుంచి మూసేశారు. నిర్వహణ వ్యయం చెల్లించకపోవడంతోనే మూసివేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శౌచాలయాలు పూర్తిగా మూసి ఉండటంతో పట్టణానికి వచ్చే వేలాది మంది మూత్రవిసర్జనకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాపార, వాణిజ్య అవసరాల కోసం పట్టణానికి వచ్చే మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పురపాలక కార్యాలయంలోని మూత్రశాల కూడా నిర్వహణపరమైన ఇబ్బందులతో మూసివేయడంతో సందర్శకులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. రూ.48 లక్షలు వెచ్చించి నిర్మించిన శౌచాలయాలు ప్రజలు అవసరాలు తీర్చడంలో విఫలమవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కౌన్సిల్ ఆమోదం లేక నిలిచిపోయింది

– చరణ్, ఏఈ, జగిత్యాల పురపాలిక

10 నెలలుగా శౌచాలయాలు మూసి ఉండటం వాస్తవమే. గత ఫిబ్రవరిలో శౌచాలయాల నిర్వహణకు తీర్మానం ప్రవేశపెట్టినా కౌన్సిల్ ఆమోదించలేదు. ఈలోపు ఎంపీ ఎన్నికల కోడ్ రావడంతో తరువాత చర్చిద్దామని అత్యసర సమావేశంలో సభ్యులు పేర్కొన్నారు. తాజాగా టీఎల్ఎఫ్ సంస్థకే నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తూ తీర్మానమైంది. త్వరలోనే అధికారికంగా ఉత్తర్వులు వచ్చిన వెంటనే శౌచాలయాలను అందుబాటులోకి తెస్తాం.

# వంతెనల నిర్మాణాలకు మోక్షం



మెట్‌పల్లి : కోరుట్ల పట్టణ శివారులోని జంబిగద్దె వద్దనున్న పెద్దవాగుపై వంతెన నిర్మాణ పనులను 2017 జనవరిలో రూ.2.80 కోట్ల నాబార్డు నిధులతో ప్రారంభించారు. వాగులో పిల్లర్లు, చెక్‌డ్యాం కోసం వాల్ నిర్మించి వదిలేశారు. తర్వాత సంబంధిత అధికారులు అదనపు నిధులు కేటాయించాలని పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. గతేడాది ప్రభుత్వం రూ.3.80 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించగా తర్వాత నిధులు విడుదల కాకపోవడంతో పనులు చేపట్టలేదు. వంతెన నిర్మాణ పనులను ప్రారంభించి ఏడున్నరేళ్లు గడుస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం రూ.3.80 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతోనైనా పూర్తి స్థాయిలో వంతెన నిర్మాణం జరిగితే పట్టణ, కోరుట్ల, కథలాపూర్ మండలాల ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది.

కోరుట్ల మండలంలోని ఏఖీన్‌పూర్ శివారులోని పెద్దవాగుపై 2017లో నాబార్డు నిధులు రూ.2.12 కోట్లతో వంతెన, చెక్‌డ్యాం నిర్మాణం పనులు ప్రారంభించి పిల్లర్లు నిర్మించారు. 2021లో రూ.2 కోట్ల నిధులు కేటాయించడంతో స్లాబ్‌వేసి ఇరువైపులా గోడలు నిర్మించారు. రెండేళ్లుగా వాగులో ఉద్ధృతంగా వరద రావడంతో వంతెనకు ఓవైపు నిర్మించిన గోడలు కూలిపోవడంతో పాటు వాగు ఒడ్డునున్న భూమి పెద్దఎత్తున కోతకు గురైంది. గతేడాది ప్రభుత్వం రూ.1.50 కోట్ల నిధులు కేటాయించినా విడుదల కాకపోవడంతో పనులు చేపట్టకుండా వదిలేశారు. ప్రస్తుతం ప్రభుత్వం రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. వంతెన నిర్మాణం పూర్తయితే సంగెం, నాగులపేట, కథలాపూర్ మండల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయి.

మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ వాగుపై లోలెవల్ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం గతేడాది రూ.2.80 కోట్ల నిధులు మంజూరు చేసింది. అనంతరం అప్పటి ప్రజాప్రతినిధులు పనులకు శంకుస్థాన చేశారు. తర్వాత నిధులు విడుదల కాకపోవడంతో పనులను ప్రారంభించలేదు. ప్రస్తుతం రూ.2.80 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. వంతెన నిర్మాణం చేపడితే రామారావుపల్లె, కోరుట్ల పట్టణం, కోరుట్ల, కథలాపూర్, వేములవాడ ప్రాంతాలకు అక్కడి ప్రాంత ప్రజలు వెళ్లడానికి దూరాభారం తగ్గుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.

కోరుట్ల నియోజకవర్గంలో వంతెనల నిర్మాణాలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్ మండలాల్లో అయిదు వంతెలనకు సీఆర్ఆర్ గ్రాంట్ కింద రూ.14.30 కోట్ల నిధులను విడుదల చేసింది. వంతెన నిర్మాణాలు పూర్తయితే ఏళ్లతరబడి నెలకొన్న ఇబ్బందులు తొలగనున్నాయి. మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల వాగుపై వంతెన నిర్మాణానికి గతేడాది ప్రభుత్వం రూ.4 కోట్ల నిధులను మంజూరు చేసింది. అప్పటి మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఆగస్టు 22, 2023న శంకుస్థాపన చేశారు. అనంతరం నిధులు విడుదల కాకపోవడంతో పనులను ప్రారంభించకుండా వదిలేశారు. ప్రస్తుతం ప్రభుత్వం రూ.4 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. మండలంలోని కోనరావుపేట, కథలాపూర్ మండలాలకు రాకపోకలకు మార్గం సుగమమవుతుంది. మల్లాపూర్ వడ్డెర కాలనీ వద్ద వంతెన నిర్మాణానికి గతేడాది ప్రభుత్వం రూ.2.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. తర్వాత నిధులు విడుదల కాకపోవడంతో పనులను చేపట్టకుండా వదిలేశారు. ప్రస్తుతం ప్రభుత్వం రూ.2.20 కోట్ల నిధులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# అమృత్ నీరు అందేదెప్పుడు?



ధర్మపురి : జిల్లాలోని అయిదు పురపాలికల్లో తాగునీటి వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అమృత్ పథకం అమలుకు నోచుకోవడం లేదు. రెండు నెలల కిందటే టెండర్లు పూర్తయినా పనులు ప్రారంభించలేదు. గుత్తేదార్ల ఎంపిక ప్రక్రియ కూడా జరిగినా పనులను ప్రారంభించడంలో జాప్యం జరుగుతోందని ప్రజలు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో చేపడుతున్న అమృత్ యోజన(అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్) 2.0 పథకం కింద జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ మున్సిపాలిటీలను ఎంపిక చేశారు. ఏ ఏ పనులు చేపట్టాలో నిర్ణయించి.. టెండర్లు సైతం ఆహ్వానించారు. తాగునీటి పథకాల విస్తరణకు ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించేందుకు స్థలాలను ఎంపిక చేశారు. కొన్ని చోట్ల ఆయా ఎమ్మెల్యేలతో శంకుస్థాపనలు చేయగా.. మరికొన్ని చోట్ల ప్రారంభదశలో ఉన్నాయి. ఓవర్‌హెడ్ ట్యాంకులు, నూతన పైపులైన్ల నిర్మాణాలు, నల్లా కనెక్షన్లను వెంటనే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. దీంతో వేసవిలో తాగునీటి సమస్యలు తీరనున్నాయి. జిల్లాకు రూ.125 కోట్లు

జిల్లాకు అమృత్ 2.0 పథకం కింద తొలి విడత రూ.125.95 కోట్ల నిధులు విడుదలయ్యాయి. మున్సిపాలిటీల వారిగా జనాభా ప్రతిపాదకన జగిత్యాలకు రూ.35, కోరుట్లకు రూ.37.75, మెట్‌పల్లికి రూ.17.60, రాయికల్‌కి రూ.13.80, ధర్మపురికి రూ.23.00 కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో భవిష్యత్తు జనాభాను అంచనా వేసి.. పైపులైను విస్తరణ, నల్లాలు, ట్యాంకుల నిర్మాణాలు చేపట్టనున్నారు. జనాభాకు అనుగుణంగా నిధులు విడుదల కావడంతో పట్టణవాసులకు రానున్న రోజుల్లో నీటి సమస్యలు పరిష్కారం కానున్నాయి. పనుల జాప్యంపై ధర్మపురి పుర కమిషనర్ గంగాధర్ మాట్లాడుతూ.. ధర్మపురిలో 23 కి.మీల పైపులైను, 2 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలు, 1500 నల్లాలను ఏర్పాటు చేస్తామన్నారు. అమృత్ పథకం కింద ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయని.. పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

# ప్రతిపాదనలు ఘనం.. అమలు అర్ధంతరం

సిరిసిల్ల : జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పురపాలికలు రోజురోజుకు విస్తరిస్తున్నాయి. దీనికి తగ్గట్టుగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు చేపట్టడం లేదు. 2023–24 బడ్జెట్‌లో రెండు పురపాలికల్లో కలిపి వివిధ విభాగాల్లో అభివృద్ధికి రూ. 118.36 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. వీటి మంజూరుకు ప్రభుత్వానికి కూడా పంపారు. వాటిలో రూ.18 కోట్లు మాత్రమే ప్రభుత్వం నుంచి విడుదలయ్యాయి. అంటే నిర్ణయించిన బడ్జెట్‌లో 15 శాతం పనులు మాత్రమే జరిగాయి. రెండు పురపాలికల్లో తీవ్ర ఆర్థిక సంక్షోభం కారణంగా పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పన్నుల రూపంలో వస్తున్న రూ.4 కోట్ల ఆదాయంలో ఉద్యోగుల జీతాలు, పారిశుద్ధ్యం నిర్వహణ, ఇతరత్రా ఖర్చులే నెలకు రూ.కోటిపైనే ఉంటున్నాయి. వీటిలోనూ చాలా వరకు గుత్తేదారులకు చెల్లించాల్సిన బిల్లులు ఉన్నాయి.

ముందుకు రాని గుత్తేదారులు

2023–24 పురపాలక బడ్జెట్‌లో రూ.47.70 కోట్లతో వార్డుల వారీగా మురుగుకాల్వలు, సీసీ రహదారులు, కేంద్రీయ విద్యుద్దీకరణ, కూడళ్ల విస్తరణకు టీయూఎఫ్ఐడీసీ కింద ప్రతిపాదనలు చేశారు. వీటిలో సీసీ రహదారులు, మురుగు కాల్వల పనులు టెండర్ల దశలో నిలిచిపోయాయి. రూ.3 కోట్లతో కలెక్టరేట్–రగుడు కూడలి విస్తరణ



పనులు దక్కించుకున్న గుత్తేదారు పైపైన పనులు చేసి వదిలేశాడు. ఏడాదిగా ఆ పనులు ముందుకు సాగడం లేదు. చంద్రంపేట, శాంతినగర్, నర్సింగ్‌కాలేజీ, సంజీవయ్య కూడళ్ల అభివృద్ధికి రూ.2 కోట్ల పనులు దక్కించుకున్న గుత్తేదారులు ముందుకు రావడం లేదు. రూ.2 కోట్లతో కళాశాల ఆవరణలో క్రీడా మైదానం పనులు ప్రారంభించి వదిలేశారు. సిరిసిల్ల– వెంకటాపూర్ బాహ్యవలయ రహదారిలో రూ.4.60 కోట్లతో కేంద్రీయ విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయి. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో పురపాలికకు అప్పగించలేదు. గత ప్రభుత్వ హయాంలో పురపాలికలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినా నిధులు మాత్రం పూర్తిగా విడుదల చేయలేదు. దీంతో పురపాలికలో అన్ని విభాగాల్లో పనులు చేసిన గుత్తేదారులకు పెద్ద ఎత్తున బకాయిలు పడింది. ఇటీవల వినాయక చవితి, బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు రాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు వారిని వేడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

వేములవాడ పురపాలికలో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అలాగే అంబేడ్కర్ కూడలి విస్తరణ, క్రీడా మైదానంలో ట్రాక్ నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. పురపాలికలో దాదాపు పనులన్నీ నిలిచిపోవడంతో సిరిసిల్ల పురపాలక కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్ నిధుల విడుదలకు ఉన్నతాధికారులను కోరుతూ రెండు నెలల క్రితం లేఖ రాశారు. దీనికి గతంలో నిధులు మంజూరై టెండర్లు పూర్తయిన పనులు చేసుకునేలా మౌఖికంగా ఆదేశించారు. ప్రతిపాదించిన పనులకు నిధుల మంజూరు విషయమై ఎలాంటి సమాచారం రాలేదు. విలీన గ్రామాలు, శివారు కాలనీలో అంతర్గత రహదారులు, మురుగుకాల్వల నిర్మాణాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

# కొత్త వీసీ ఎదుట సవాళ్లెన్నో!

కరీంనగర్ : ఎట్టకేలకు శాతవాహన విశ్వవిద్యాలయానికి పూర్తి స్థాయి ఉపకులపతిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.. గతంలో ఇక్కడ రిజిస్ట్రార్‌గా పని చేసిన ఉమేశ్‌కుమార్‌కు ఈ బాధ్యతలు అప్పగించింది. ఆయన బాధ్యతలు స్వీకరించనుండగా.. ఆయనకు పలు సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి..

ఈ ఏడాది మే 21వ తేదీన అప్పటి ఉప కులపతిగా ప్రొఫెసర్ సంకశాల మల్లేశ్ పదవీ కాలం ముగియడంతో ఐఏఎస్ అధికారి సురేంద్ర మోహన్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. వీసీ పోస్ట్ కోసం 158 మంది ఆచార్యులు దరఖాస్తు చేసుకోగా ఎట్టకేలకు ఇక్కడి విశ్వవిద్యాలయానికి పూర్తిస్థాయి వీసీగా ఉమేశ్‌కుమార్‌ను నియమిస్తూ సర్కారు ఉత్తర్వులు వెలువరించింది. 2008లో విశ్వవిద్యాలయం ఏర్పాటైనప్పటినుంచి ఇప్పటి వరకు ముగ్గురే పూర్తిస్థాయి వీసీలుగా పనిచేశారు. మొదటి ఉప కులపతిగా మహ్మద్ ఇక్బాల్ అలీ, 2012లో కడారు వీరారెడ్డి, 2021లో ఎస్.మల్లేశ్ రెగ్యులర్ వీసీలుగా కొనసాగారు.



రిజిస్ట్రార్‌గా రెండేళ్లు..ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఉమేశ్‌కుమార్ రసాయన శాస్త్ర ఆచార్యుడిగా పలుచోట్ల సేవలు అందించారు. 2018– 2020 మధ్య శాతవాహన విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా పని చేశారు. ఆ పదవికి వన్నెతెచ్చే విధంగా వ్యవహరిస్తూ విద్యార్థుల మన్ననలు అందుకున్నారు. ఆయన హయాంలోనే స్నాతకోత్సవం నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో అదే మొదటి.. చివరి స్నాతకోత్సవం కావడం గమనార్హం. రహదారులు, వసతి గృహాల నిర్మాణాలు, అంబులెన్స్ ఏర్పాటు, ఏటీఎం సదుపాయాలు విద్యార్థులకు కల్పించారు. నల్గొండ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా, ఇన్‌ఛార్జి వీసీగానూ ఈయన పనిచేశారు.

వీటిపై దృష్టి పెడితేనే..గడిచిన కొన్నేళ్లుగా విశ్వవిద్యాలయంలో నిధుల దుర్వినియోగం, అవినీతిపై ఆరోపణలు విపరీతంగా వచ్చాయి. ఇటీవల ఇక్కడి వ్యవహారంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు కూడా చేపట్టారు. ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ, అవినీతికి ఆస్కారం లేకుండా సంస్కరణలకు, మార్పులు, చేర్పులకు శ్రీకారం చుట్టాలి. మరో వసతి గృహ భవనం నిర్మిస్తే ఇరుకిరుకుగా ఉండాల్సిన అవసరం తప్పుతుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకున్న సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చడం, కొత్త పోస్ట్‌లను మంజూరు చేయించడం, ఖాళీలు లేకుండా చూడటంలాంటి చర్యలతో ముందుకు సాగాలని విద్యార్థులు కోరుకుంటున్నారు. ఇవన్నీ పక్కాగా ఉంటేనే న్యాక్ గుర్తింపు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే 12బీ హోదా ఉన్నప్పటికీ.. ఆ స్థాయిలో నిధులను రాబట్టడంపై కొత్త వీసీ దృష్టి పెట్టాలి. మారుతున్న కాలంతోపాటు కొత్త కోర్సుల ఆవశ్యకతను గుర్తించి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుని అందించాలి.

# ఎల్లంపల్లి పైపులైన్ల స్థలం ఆక్రమణ

గంగాధర: ఈ చిత్రంలో పైకి తేలిన రెండు పైపులైన్లు పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కటికెనపల్లిలోనివి. మూడేళ్ల కిందట పైపులపై ఉన్న మట్టిని కొందరు తొలగించి చదును చేయడంతో పైపుల కిందకు నీరు వెళ్లి పైకి తేలాయి. తర్వాత ఏడాది యాసంగిలో ఉమ్మడి జిల్లాకు ఎల్లంపల్లి నీరు రాక వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఘటన నుంచి అందరూ గుణపాఠం నేర్చుకోవాల్సి ఉన్నా.. పరిస్థితిలో మార్పు కనిపించడంలేదు.

**59 కి.మీ. పొడవునా ఆక్రమణలే..**

ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో ఆయా గ్రామాల చెరువులు నింపేందుకు 59 కి.మీ పొడవున 40 మీటర్ల వెడల్పుతో రెండు పైపులైన్లు వేసి నీటిని ఎత్తిపోస్తున్నారు.

ఎల్లంపల్లి నుంచి ధర్మారం మండలం నందిమేడారం రిజర్వాయర్‌లోకి 11 కి.మీ నీటిని ఎత్తిపోసి అక్కడి నుంచి 25.50 కి.మీ దూరంలోని గంగాధర, నారాయణపూర్ జలాశయాల్లోకి, ఇక్కడి నుంచి 10.892 కి.మీ దూరంలోని కొడిమ్యాలకు రెండు వరుసల పైపులైన్లతో ఎత్తిపోస్తారు. – ఒక వరుస పైపులైన్‌తో కొడిమ్యాల నుంచి 4.935 కి.మీ దూరంలో ఉన్న పోతారం జలాశయం, ఇక్కడి నుంచి 4.200 కి.మీ దూరంలోని సూరంపేట, జోగాపూర్ రుద్రంగి బ్రిడ్జి 5.800 కి.మీ, జోగాపూర్ నుంచి న్యూ ట్యాంకు చందుర్తి 4.68 కి.మీ చెరువులోకి నీటిని ఎత్తిపోసి ఇక్కడి నుంచి కాలువల ద్వారా పంటలకు సాగునీటిని అందిస్తున్నారు. పైపులైన్ల పొడవున ఆక్రమణలు చేసి పంటలు వేస్తుండగా ప్రమాదం పొంచి ఉంది.

**నీటితో సిరుల పంట**



ఎల్లంపల్లి నీరు రాక ముందు చొప్పదండి నియోజకవర్గం ఎడారి ప్రాంతంగా ఉండేది. ఏడేళ్లుగా రెండు పంటలు పండిస్తున్నారు. రెండు వరుసల ఎల్లంపల్లి పైపులపై 40 మీటర్ల మేరకు భూములు సేకరించి అప్పట్లోనే రైతులకు నష్టపరిహారం చెల్లించారు.

పైపులైన్లపై అక్కడక్కడా గేట్‌వాల్వ్‌లు, ఏయిర్‌వాల్వ్‌లు కేటాయించగా పైపులు పైకి తేలకుండా మట్టి పోశారు. అయితే కొందరి నిర్వాకంతో చాలామంది నష్టపోయారు. పైపులైన్లపై పంటలు వేయడంతో.. పైపులు పైకి తేలి.. నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. ఇలాంటి ఘటనటు ధర్మారం మండలం, గంగాధర మండలం సర్వారెడ్డిపల్లిలో రెండుచోట్ల చోటు చేసుకుంది. **అధికారులు కదిలితేనే..**– సాగునీటి పారుదల శాఖ, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం దీనిపై దృష్టి సారించాల్సిన అవసరముంది. ఎల్లంపల్లి పైపులైన్ల ఖాళీ స్థలాన్ని గ్రామాల్లో ఐకేపీ కేంద్రాలకు స్థల సమస్య నెలకొనగా.. ఈ ఖాళీ స్థలాన్ని వాటికి వినియోగించుకునే అవకాశము ంది. ఇలా చేస్తే పైపులైన్ల స్థలం కబ్జాకు గురికాకుండా, పైపులైన్ల మరమ్మతులకు సమస్య తలెత్తినా పరిష్కరించుకునే వీలుంటుంది.సమస్య ఉందికొందరు ఎల్లంపల్లి పైపులైన్ల స్థలం కబ్జా చేసి పంటలు సాగు చేస్తున్నారు. పైపులైన్లు దెబ్బతింటే వాటిని మరమ్మతు చేయడం ఇబ్బందిగా ఉంటుంది. గతంలో పెద్దపల్లి జిల్లాలో కొందరు చేసిన ఆక్రమణలతో చాలామందికి సాగునీరు అందించలేకపోయాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.– సంతుప్రకాశ్‌రావు, ఈఈ ఎల్లంపల్లి

## ఛిద్రమైన రహదారులు.. తప్పని తిప్పలు

పెద్దపల్లి : జిల్లాలో కురుస్తున్న వర్షాలతో ప్రధాన రహదారులు ధ్వంసమయ్యాయి. రోడ్లపై గుంతలు ఏర్పడి, వంతెనల వద్ద మట్టి కుంగిపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ప్రతిపాదనలు చేసేలోపే మరోచోట రోడ్డు దెబ్బతింటున్న పరిస్థితి.

**ఏళ్లుగా సమస్యలు** జిల్లాలో ప్రధాన రహదారులతోపాటు అనుసంధాన రోడ్లు నిత్యం దెబ్బతింటున్నాయి. కొన్నాళ్ల నుంచి ప్రతిపాదనలకు నోచుకోకపోవడంతో ఎక్కడికక్కడే గుంతలు దర్శనమిస్తున్నాయి. గ్రామాల మధ్యలోని వాగులపై నిర్మించిన వంతెనలు శిథిలావస్థలోకి చేరుతున్నాయి. కొన్నిచోట్ల వరద ఉద్ధృతి తట్టుకోలేక గొయ్యిలా మారుతు న్నాయి. జిల్లాలో ముత్తారం, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, సుల్తానాబాద్ మండలాల్లో ఇసుక క్వారీలతో తారు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇటీవల రాకపోకలు నిలిచినప్పటికీ ఇబ్బందులకు మోక్షం కలగడం లేదు. **నిధులు కేటాయిస్తేనే ప్రయోజనం**

గతేడాది దెబ్బతిన్న రోడ్లపై మొరం పోసి చేతులు దులుపుకొన్నారు. శాశ్వత మరమ్మతుల ప్రతిపాదనలకు మోక్షం లభించడం లేదు. ఈ ఏడాది వానలకు రోడ్ల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. జిల్లాలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలోని రహదారుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు కొరవడుతున్నాయి. జిల్లాలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు వేర్వేరుగా తమ పరిధిలోని రోడ్ల మరమ్మతులు చేసే చర్యలకు ఉపక్రమించారు. నిధులు విడుదల చేస్తే ప్రయోజనం కలగనుంది. జిల్లాలో దెబ్బతిన్న రోడ్లను గుర్తిస్తున్నామని ఆర్‌అండ్‌బీ ఈఈ భావ్‌సింగ్ తెలిపారు. తాత్కాలికంగా మరమ్మతులకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని చెప్పారు. జిల్లాలో తమ పరిధిలో రోడ్ల నిర్మాణంలో జాప్యం లేకుండా పనులు చేపడుతున్నామని పీఆర్ ఈఈ గిరీశ్‌బాబు తెలిపారు.

ఇదీ మడుగు కాదు.. తారు ధ్వంసమై గుంతలుగా మారిన ముత్తారం మండలం ఖమ్మంపల్లి రోడ్డు. ముత్తారం మండలంతో పాటు భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచెర్లకు వెళ్లే ప్రధాన రోడ్డు దెబ్బతింది. తారు మాయమై మట్టిని తలపిస్తున్న ఈ రోడ్డు జూలపల్లిలోనిది. ఏడాది క్రితం తారు తొలగించి కంకర పొడి చల్లగా వానలకుతోడు వాహనాల రద్దీతో కొట్టుకుపోయింది. రోడ్డు గుంతలుగా మారడంతో ప్రయాణం ఇబ్బందిగా సాగుతోంది. పాలకుర్తి మండలం వెక్లాస్‌పూర్, పుట్నూర్ మధ్యలో కుంగిన వంతెన ఇది. గ్రామాలకు రాకపోకలు అందించే ఈ రోడ్డులో కల్వర్టు కుంగిపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తోంది.

# కంచె దాటుతున్నా.. కళ్లు మూసుకున్నారు



హైదరాబాద్: ఒకప్పుడు రాజధానికి తాగునీటిని అందించిన జంటజలాశయాలను పరిరక్షించడంలో అటు ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు ఇటు జలమండలి ఘోరంగా విఫలమయ్యాయి. వీటి పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు వస్తున్నా సంబంధిత శాఖల్లోని కొందరు అధికారులు మామూళ్ల మత్తులో పట్టించుకోలేదు. కీలకమైన హిమాయత్‌సాగర్ పరిధిలో ఇప్పటికీ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల హద్దులు గుర్తించి తుది నోటిఫికేషన్ ఇవ్వడంలో సంబంధిత అధికారులు ఘోరంగా విఫలమయ్యారని హైడ్రా పరిశీలనలో వెలుగులోకి వచ్చింది. కూల్చివేతల క్రమంలో తుది నోఫికేషన్‌ను ఇవ్వాలని హైడ్రా అధికారులు అడిగితే అసలు విషయం చెప్పారు. ఈ నేపథ్యంలో యుద్ధప్రాతిపదికన తుది నోటిఫికేషన్ ఇవ్వాలని కోరడంతో ఇప్పుడు సంబంధిత అధికారులు ఆ పనిలో ఉన్నారు.

**పదేళ్ల కిందట సర్కారు ఆదేశించినా..**

జంటజలాశయాలను రక్షించడం కోసం అనేక ఏళ్ల కిందటే ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వం 111 జీవోను తీసుకువచ్చింది. వీటి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోకి వచ్చే ప్రాంతాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక్క నిర్మాణం కూడా ఉండకూడదని ఆదేశాలు జారీ చేశారు. దీనికి అనుగుణంగా హద్దులను గుర్తించి నిర్ధారణ చేస్తూ తుది నోటిఫికేషన్ ఇవ్వాలని పదేళ్ల కిందట సర్కార్ సంబంధిత అధికారులను ఆదేశించింది. జలమండలి, రెవెన్యూ అధికారుల తోడ్పాటుతో క్షేత్రస్థాయిలో హద్దులు గుర్తించి నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. విచిత్రంగా ఇప్పటివరకు అధికారులు హిమాయత్‌సాగర్‌కు తుది నోటిఫికేషన్ ఇవ్వలేదు. క్షేత్రస్థాయిలో కొన్ని ప్రాంతాల్లో హద్దులను గుర్తించారు గానీ తుది నోటిఫికేషన్ ఇవ్వకపోవడం వల్ల అక్రమ భవనాలను నిర్మించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వీలుండదని కిందిస్థాయి అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ఈ పరిధిలోని భవనాలను కూలగొట్టే ప్రయత్నం చేస్తే సంబంధిత నిర్మాణదారులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తే వారికి కొంతకాలం గడువు లభించే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. దీంతో తక్షణం తుది నోటిఫికేషన్ ఇవ్వాలని హైడ్రా అధికారులు జలమండలి, సాగునీటి శాఖలను కోరడంతో హడావుడిగా ప్రక్రియను మొదలుపెట్టారు.

**హద్దు మీరారని తేలితే కూల్చివేతలే..**గతంలో నిర్ధారించిన ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులు కచ్చితంగా ఉన్నాయా లేదా అన్న దానిపై హైడ్రా అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ హద్దులు కచ్చితంగా ఉన్నాయని తేలితే తుది నోటిఫికేషన్‌కు చర్యలు తీసుకుంటారు. ఎక్కడైనా తేడా వస్తే మరోసారి సర్వే జరిగే అవకాశం ఉందని హైడ్రా అధికారి ఒకరు తెలిపారు. ఉస్మాన్‌సాగర్( గండిపేట) పరిధిలో 2019లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దులను నిర్ధారిస్తూ తుది నోటిఫికేషన్ ఇచ్చారు. హిమాయత్‌సాగర్‌కు తుది నోటిఫికేషన్ ఇచ్చిన తరువాత మొదటి దశలో అక్రమ నిర్మాణాలను కూల్చివేయడానికి హైడ్రా ప్రణాళిక రూపొందిస్తోంది. ఇప్పటికే ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న తమ నిర్మాణాలను కొంతమంది రాజకీయ నాయకులు కూల్చివేశారు. హైడ్రా రాకముందే వీటిని కూల్చివేస్తే కొంత గౌరవంగా ఉంటుందని పలువురు నేతలు, అధికారులు, నిర్మాణదారులు భావిస్తున్నారు.

# ఒక్క మీటతో పాఠశాల సమగ్ర చరిత్ర




హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు.. విద్యార్థులు.. ఉపాధ్యాయులు.. డెస్కులు.. బల్లలు.. ఇలా అన్ని వివరాలు ఒక్క మీటతో తెలిసిపోనున్నాయి. పాఠశాల విద్య.. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి మరిన్ని నిధులు వెచ్చించేందుకు.. కేంద్ర ప్రభుత్వం యూడైస్ ప్లస్ అనే వెబ్‌సైట్‌ను ప్రవేశపెట్టనుంది. ప్రతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేటు విద్యాసంస్థల్లోని విద్యార్థులకు ఒక వినూత్న సంఖ్య కేటాయించినట్టే.. ఉపాధ్యాయులకూ జాతీయ కోడ్ నంబరును యూడైస్ ప్లస్ కేటాయిస్తుంది. దీంతో ప్రతి పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య తెలుస్తుంది.

ఈ వివరాల ద్వారా ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిని లెక్కించి పాఠశాలల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించనుంది. యూడైస్ వెబ్‌సైట్(పోర్టల్) ఉపాధ్యాయుల వివరాలను నమోదు చేసేందుకు త్వరలో ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ శిక్షణ ఇవ్వనుంది.

**ప్రామాణికం.. తప్పనిసరి**

ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్యతోపాటు పాఠశాలలకు అందుతున్న ఆర్థిక వనరులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రత్యేక పథకాల వివరాలను యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. వీటిని ప్రామాణికంగా నిర్వహించేందుకు మండల విద్యాధికారి కార్యాలయం నుంచి రాష్ట్ర సంచాలకుల కార్యాలయం వరకు వివిధ అంచెల్లో సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. వివరాల నమోదును కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిచేసిన దృష్ట్యా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల వివరాలను నిర్ణీత గడువులో నమోదు చేయాలి. ఈ అంశాలను జిల్లా ప్రణాళిక సమన్వయకర్తలు పర్యవేక్షించనున్నారు.

**ప్రయోగశాలలు.. క్రీడా సామగ్రి**

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానంగా కంప్యూటర్, సైన్స్ ప్రయోగశాలలను ఏర్పాటు చేసేందుకు యూడైస్ ప్లస్ ఉపయోగపడనుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఒక్కో పాఠశాలకు ఎన్ని ప్రయోగశాలలు కావాలన్న అంశాన్ని ప్రతిపాదిస్తే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాని ఆధారంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు బడ్జెట్‌ను కేటాయించనున్నాయి.

యూడైస్ ప్లస్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆయా పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, రెండు జతల ఏకరూప దుస్తులు, రాత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు వీలుంటుంది.

భవిష్యత్తులో పదో తరగతి విద్యార్థుల పేర్లు, వివరాలను నామినల్ రోల్స్ ద్వారా యూడైస్ ప్లస్‌లో నమోదు చేస్తేనే పరిగణలోకి తీసుకోనున్నారు.

# తీరనున్న తాగునీటి కష్టాలు



కరీంనగర్ : కొత్తగా ఏర్పడిన పురపాలికలతోపాటు పాత పురపాలికల్లో విలీనమైన కాలనీల్లో తాగునీటి అవసరాలు తీర్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండేళ్ల కిందట అమృత్ 2.0 కింద నిధులు కేటాయించినా ప్రక్రియ ఆలస్యమైంది.. దీంతో ఆయా ప్రాంతాలు, కాలనీల్లో ఎండాకాలం వచ్చిందంటే జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. ఇటీవలే నిధుల కేటాయింపు, టెండర్ల ఆమోదం పూర్తవడంతో అధికారులు పనులు ప్రారంభించడానికి కసరత్తు ప్రారంభించారు.. దీంతో భవిష్యత్తులో తాగునీటి కష్టాలు తీరనున్నాయి..

అమృత్ 2.0 ఇలా..ఉమ్మడి జిల్లాలో 14 పురపాలికలు, రెండు నగరపాలికలు ఉండగా ఇందులో ఆరు కొత్తగా ఏర్పడిన పురపాలికలు ఉన్నాయి. రామగుండం కార్పొరేషన్ మినహాయిస్తే మిగతా 15 పట్టణాల్లో సమీప గ్రామాలను విలీనం చేశారు. పంచాయతీల హయాంలో, ఆ తర్వాత రూరల్ మిషన్ భగీరథ కింద వేసిన పైపులైన్ల సామర్థ్యం సరిపోకపోవడంతో ఎండాకాలంలో తాగునీటితోపాటు ఇతర అవసరాలకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింద విలీన కాలనీలు, పురపాలికలకు నిధులు మంజూరు చేయగా.. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కేటాయించింది. భవిష్యత్తు జనాభాను పరిగణనలోకి తీసుకొని తాగునీటి వ్యవస్థను రూపొందించుకోవడానికి ప్రజారోగ్యశాఖ ప్రణాళికలు చేసింది. అమృత్ 2.0లో ఫిల్టర్ బెడ్‌లు, పైపులైన్లు విస్తరించడం, కొత్తగా రిజర్వాయర్ల నిర్మాణం, ఫీడర్ పైపులైన్లు, పంపిణీ లైన్లు, కొత్త నల్లా కనెక్షన్లు, బల్క్ మీటర్లు వంటి పనులు చేపడుతారు. దీంతో విలీన కాలనీలు, శివారు కాలనీల్లో ఎండాకాలంలో ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలకు ఇబ్బందులు దూరం కానున్నాయి. ఈ పనులు సకాలంలో పూర్తయితే వచ్చే ఏడాదిలో పట్టణాల్లో తాగునీటి ఇబ్బందులు దూరం కానున్నాయి.

నాలుగు చోట్ల శంకుస్థాపన..కొనసాగుతున్న సర్వే

అమృత్ పథకంలో తాగునీటి సరఫరా మెరుగు పర్చేందుకు 14 పురపాలికలు, ఒక నగర పాలికను మొదటి ప్యాకేజీలో చేర్చారు. ఈ ప్యాకేజీలో రూ.516.45 కోట్లు కేటాయించారు. రాష్ట్ర స్థాయిలో టెండర్ పూర్తి చేయగా ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. స్థలాల సేకరణ చేయాల్సి ఉంది. వీటిని త్వరగా అప్పగిస్తే పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు వేములవాడ, మంథని, ధర్మపురి, సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లో శంకుస్థాపనలు చేశారు. అమృత్ కింద తాగునీటి పథకాల పనులు రెండు నెలల్లో ప్రారంభం అవుతాయని కరీంనగర్ ప్రజారోగ్యశాఖ ఇంజినీరింగ్ అధికారి తెలిపారు. స్థలాలు చూపించి అప్పగించాలని కోరుతూ ఆయా కమిషనర్లకు లేఖలు కూడా పంపించామని, వారి ఆమోదం తీసుకొని పనులు చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# చట్టాలు తెలుసుకొని.. వాదనలు వినిపిస్తూ!

కరీంనగర్ : న్యాయవాద వృత్తిలోకి రావడమంటే సాహసమైన నిర్ణయం తీసుకున్నట్టేనని చాలామంది చెబుతుంటారు. అందులోనూ అతివలు అతి తక్కువ మంది వస్తుంటారు. కానీ ఇటీవల పరిస్థితిలో మార్పు కనిపిస్తోంది. మహిళలూ ఇటు వైపు అడుగులు వేస్తున్నారు. గతంతో పోలిస్తే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ రంగంలోకి వచ్చిన వారేమంటున్నారో కథనం.

ఆరు వందల మంది వరకు..

ఈ వృత్తిలో ఉన్నత స్థానానికి ఎదగాలంటే నిత్య విద్యార్థిలా చట్టాల గురించి, పలు ఉన్నత న్యాయస్థానాలలో వెలువడుతున్న తీర్పుల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. ప్రస్తుతం న్యాయ విద్యాబోధనలో అనేక మార్పులు వచ్చాయి. ఇంజినీరింగ్, వైద్య విద్యతోపాటు న్యాయ కళాశాలలూ పెరుగుతున్నాయి. అయిదారు ఏళ్ల వరకు కరీంనగర్ జిల్లా కోర్టులో కేవలం పది మందిలోపే మహిళా న్యాయవాదులు కనిపించేవారు. ప్రస్తుతం 200 మంది వరకు ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు ఆరు వందల మంది వరకు ఉన్నారు. పట్టుదలతో ఎంతోమంది న్యాయశాస్త్ర పట్టా అందుకుంటున్నారు. న్యాయం కోసం వచ్చే వారికి మేమున్నామనే భరోసా ఇస్తున్నారు. ఏటా పదుల సంఖ్యలో న్యాయవాద పట్టా పుచ్చుకుంటున్నా.. పరిస్థితులనుబట్టి వారు వేర్వేరు ప్రాంతాలకు వెళ్తున్నారు.



కుటుంబ సభ్యుల ప్రోత్సాహం అవసరం

ప్రతి ఒకరికీ చట్టాలపై అవగాహన అవసరం. అందుకే ఈ రంగంలోకి వచ్చా. మహిళా న్యాయవాదులకు ప్రత్యేకమైన బార్ అసోసియేషన్ గదులను, సదుపాయాలు కల్పించాలి. సీనియర్ల వద్దకు చేరగానే కక్షిదారుల కేసులను అధ్యయనం చేయాలి. మహిళలు ఇటు వైపు వచ్చేలా కుటుంబసభ్యులు ప్రోత్సహించాలి.

– సర్దార్‌నీ మీతా కౌర్

**అమ్మ సహకారంతో..**అమ్మ సహకారంతో న్యాయవాద వృత్తిలోకి వచ్చా. చాలామంది స్త్రీలు తమ హక్కులను తెలుసుకోలేకపోతున్నారు. అలాంటి వారికి మహిళా న్యాయవాదులు అండగా ఉంటున్నారు. ఆపద సమయంలో ఏం చేయాలో తెలియజేస్తున్నారు. గౌరవప్రదమైన వృత్తిలో ఉన్నామనే భావన ఉండాలి.

ఆసియా బేగం

నిరంతర కృషి ఉంటేనే..

న్యాయవాద వృత్తిలో కొనసాగాలంటే నిరంతర కృషి ఉండాలి. పోలీసు కేసులలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, ప్రభుత్వానికి సంబంధించిన కేసులను వాదించడానికి ప్రభుత్వ న్యాయవాదిగా విధులు నిర్వర్తించాను. జూనియర్ న్యాయవాదులు కర్తవ్యంగా భావించి విధులు నిర్వహిస్తేనే ఇందులో రాణించగలరు. – ఆర్.వి.గీతారెడ్డి


పురుషులతో సమానంగా..న్యాయవాద వృత్తిలో పురుషులతో సమానంగా మహిళలు ముందుకు వస్తున్నారు. వృత్తిలో కొన్ని ఇబ్బందులు ఎదురైనా అధిగమిస్తున్నారు. కొన్నిసార్లు పోలీసుస్టేషన్, రెవెన్యూ కార్యాలయాలకు కక్షిదారుల తరఫున వెళ్లాల్సి ఉంటుంది. మా వద్దకు వచ్చేవారికి న్యాయం జరిగేలా సలహాలు ఇస్తున్నాం. జీవనోపాధి కోసమే వృత్తిలోకి వచ్చామని కాకుండా సమాజ సేవ కోసమే అన్నట్లుగా ఉండాలి.

– మూల తిరుమల దేవి

వృత్తిపై గౌరవంతో..మా నాన్న రాజకీయాలలో ఉండేవారు. ఆయనకు న్యాయవాదులంటే ఎంతో గౌరవం. ఆ స్ఫూర్తితో ఈ వృత్తిలోకి వచ్చా. స్వశక్తి మహిళా సంఘాల ద్వారా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించా. చట్టాలపై అవగాహన కల్పించా. ప్రజలతో మమేకమై వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నా.– మెతుకు హేమలత

## ఉల్లంఘిస్తే.. లైసెన్స్‌పై వేటే

హైదరాబాద్: ట్రాఫిక్ ఉల్లంఘనులపై పూర్తి స్థాయిలో కొరడా ఝుళిపించేందుకు రవాణా శాఖ సిద్ధమైంది. దాదాపు 90శాతం వరకు రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదమే కారణం కావడంతో మరింత కఠినంగా ట్రాఫిక్ నిబంధనల అమలుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం డ్రంకెన్ డ్రైవ్, నిర్లక్ష్య పూరిత డ్రైవింగ్ తదితర కొన్ని ఉల్లంఘనలకు మాత్రమే లైసెన్సులను సస్పెండ్ చేస్తున్నారు. సిగ్నల్ జంపింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్, ఓవర్ స్పీడ్ లాంటి వాటికి చలానాలతో సరిపెడుతున్నారు. ఇక నుంచి ఇలాంటి ఉల్లంఘనలపైనా ఉదాసీనత ఉండకూడదని రవాణా శాఖ భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతేడాది హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి



పరిధిలో 16,649 మంది లైసెన్సులను సస్పెండ్ చేశారు. ఈ ఏడాది ఇప్పటివరకు గ్రేటర్‌లోని మూడు జిల్లాల పరిధిలో 7,565 లైసెన్సుల సస్పెన్షన్‌కు రవాణా శాఖ నిర్ణయించింది. ఇందులో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులే అధికం. ఇతర కొన్ని ఉల్లంఘనలకు చలానాలు రాస్తున్నా.. కొందరు వాహనదారుల్లో మార్పు కనిపించడం లేదు. దీంతో అన్ని రకాల ట్రాఫిక్ నిబంధనలు పాటించనివారి లైసెన్సులు 3–6 నెలల పాటు సస్పెండ్ చేయనున్నారు. దీంతో వాహనాలు నడిపే అవకాశం కోల్పోతారు. లైసెన్సు సస్పెన్షన్ సమయంలో వాహనాలు నడిపితే కేసులు నమోదుచేయనున్నారు. లైసెన్సులు సస్పెండ్ చేస్తే.. విదేశాలకు వెళ్లే యువతకు నష్టమే.




# రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ.. కీలక వ్యాఖ్యలు

కజాన్: బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సమావేశం కోసం రష్యాలోని కజాన్ నగరం వెళ్లిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వీరిద్దరి మధ్య జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ వివాదానికి వీలైనంత త్వరగా, శాంతియుత పరిష్కారానికి మద్దతు ఇస్తానని మోదీ పునరుద్ఘాటించారు. శాంతి పునరుద్ధరణకు సహకారం అందించేందుకు భారత్ సదా సంసిద్ధంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. "రష్యా - ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న ఘర్షణ అంశంపై నేను నిరంతరం మీతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నాను. నేను గతంలో చెప్పినట్టుగా సమస్యలను శాంతియుత విధానంలో పరిష్కరించుకోవాలని మేము భావిస్తున్నాం. శాంతి, స్థిరత్వం స్థాపనకు మేము సంపూర్ణ మద్దతు ఇస్తున్నాం. మా ప్రయత్నాలన్నీ మానవీయతకే ప్రాధాన్యత ఇస్తాయి. రాబోయే కాలంలో కూడా సాధ్యమైన అన్ని సహకారాలు అందించడానికి భారత్ సిద్ధంగా ఉంది" అని అధ్యక్షుడు పుతిన్‌కు ప్రధాని మోదీ చెప్పారు. కాగా బ్రిక్స్ సదస్సుల్లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ ప్రస్తుతం కజాన్ సిటీలో ఉన్నారు. గత మూడు నెలల వ్యవధిలో తాను రెండవసారి రష్యాలో పర్యటించడంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత మెరుగుపడతాయని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. "మీ స్నేహానికి, సాదర స్వాగతానికి, ఆతిథ్యానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. బ్రిక్స్ సదస్సు కోసం కజాన్ వంటి సుందరమైన నగరాన్ని సందర్శించే అవకాశం అవకాశం లభించడం పట్ల సంతోషంగా ఉంది. కజాన్ నగరంలో భారత కొత్త కాన్సులేట్ ప్రారంభం కావడంతో సంబంధాలు మరింత బలపేతం అవుతాయి" అని పుతిన్‌తో మోదీ అన్నారు.

# వారిపై చర్యలు తప్పవు.. హోంమంత్రి అనిత మాస్ వార్నింగ్



అమరావతి: వైసీపీ ప్రభుత్వంలో గాడి తప్పిన వ్యవస్థలను తిరిగి గాడిలోకి తీసుకువస్తున్నామని హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. వైసీపీ నాయకులకు తాము సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని.. ప్రజలకే తాము జవాబు దారితనంగా ఉంటామని అన్నారు. జగన్ ప్రభుత్వంలో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఏపీలో ఎక్కడ కూడా సీ.సీ కెమెరాలు పని చేయడం లేదని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు.. ఇవాళ(మంగళవారం) టీడీపీ కార్యాయలంలో హోం మంత్రి వంగలపూడి అనిత మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనిత మీడియాతో మాట్లాడుతూ... పోలీసు వ్యవస్థను గాడిలో పెట్టడానికి వందల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. గంజాయి పండించి వైసీపీ నాయకులు అక్రమాలకు పాల్పడ్డారని విమర్శలు చేశారు. ఐదేళ్లలో జరిగిన దాడులు, అత్యాచారాలు, హత్యలపై మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. జగన్‌కు అస్సలు స్పెషల్ కోర్టు అంటే తెలుసా అని ప్రశ్నించారు. గతంలో నేరం జరిగితే 6 నెలలు దాటినా నిందితులు దొరికేవారు కాదని అన్నారు. ఇప్పుడు ఘటన జరిగిన 24 గంటల్లో నిందితులను పట్టుకుంటున్నామని తెలిపారు. గతంలో మహిళపై అఘాయిత్యాలు జరిగితే జగన్ ఎందుకు పరామర్శించలేదని హోం మంత్రి వంగలపూడి అనిత అడిగారు.

# విజయవాడ మెట్రోను అమరావతికి అనుసంధానించాలి: మంత్రి నారాయణ



దిల్లీ: కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ఏపీ మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ మంగళవారం దిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులపై కీలకంగా చర్చించారు. విశాఖ, విజయవాడ మెట్రోపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. విజయవాడ మెట్రోను అమరావతికి అనుసంధానం చేయాలని మంత్రి నారాయణ ప్రతిపాదించారు. ఇప్పటికే దీనికి సంబంధించి ప్రతిపాదనలు పంపినట్టు కేంద్రమంత్రి ఖట్టర్ దృష్టికి తెచ్చారు. అమృత్ పథకం అమలుపై కూడా కీలక చర్చ జరిగింది. మెట్రో ప్రాజెక్టులపై తదుపరి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఖట్టర్ చెప్పినట్టు సమాచారం.

గత తెదేపా ప్రభుత్వంలో విజయవాడ మెట్రో ప్రాజెక్టు టెండర్ల వరకు వెళ్లింది. తర్వాత ప్రభుత్వం మారడంతో మెట్రో ప్రాజెక్టును పక్కన పెట్టేశారు. భూసేకరణనూ గత ప్రభుత్వం ఉపసంహరించింది. తాజాగా కూటమి ప్రభుత్వ రాకతో మెట్రో ఎండీగా ఎన్‌పీ రామకృష్ణారెడ్డిని నియమించారు. విజయవాడలో లైట్ మెట్రోకు మళ్లీ ప్రతిపాదిస్తున్నారు. పీఎన్‌బీఎస్ నుంచి ఒక కారిడార్ ఏలూరు రోడ్డులో, మరో కారిడార్ బందరు రోడ్డులో రానుంది. ప్రస్తుతం సుదీర్ఘ పైవంతెన ఎన్‌హెచ్‌ఏఐ నిర్మించనుంది. మెట్రో లైనుకు ఆటంకం లేకుండా ఆదిలోనే చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు.

# వంగవీటి రాధా నారా లోకేష్ భేటీ..కారణమిదే.



అమరావతి: మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత వంగవీటి రాధాకృష్ణ కొన్ని రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యారు. అయితే ఇవాళ(మంగళవారం) వంగవీటి రాధాను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. ఇటీవల అస్వస్థతకు గురైన రాధాకృష్ణ కోలుకుంటున్నారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని మంత్రి లోకేష్ విజయవాడకు చేరుకున్నారు. తాడేపల్లి మండలం ప్రాతూరులోని వంగవీటి రాధాకృష్ణ ఇంటికి వెళ్లి లోకేష్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని నారా లోకేష్ ఆకాంక్షించారు.

# సహానా విషయంలో వైసీపీ నేతలు రాజకీయం చేస్తున్నారు: ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు

గుంటూరు జిల్లా: వైసీపీ ప్రభుత్వంలో తప్పు చేసిన వారిపై తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు అన్నారు. గుంటూరులోని జీజీహెచ్‌లో బ్రెయిన్ డెడ్ అయిన తెనాలి యువతి సహన కుటుంబ సభ్యులను టీడీపీ నేతలు ఆలపాటి రాజా, నక్కా ఆనంద్ బాబు ఇవాళ(మంగళవారం) పరామర్శించారు. తెనాలిలో 2 రోజుల క్రితం ప్రమాదానికి గురైన సహనాని పరామర్శించామని ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు అన్నారు. వైసీపీ నేతలు ఈ విషయంపై రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు, మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గుంటూరుకు రేపు రావడం అంటే నవ్వొస్తుందని అన్నారు. వైసీపీ హయాంలో జరిగిన దాడులు, హత్యలు జగన్ మరచిపోయారేమో అనిపిస్తోందని విమర్శించారు.

బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని సీఎం చంద్రబాబు నాయుడు వైద్యులకు సూచించారని అన్నారు. సహనాకి అన్నిరకాల సహాయక వనరులు సత్వరమే అందిస్తామని ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు భరోసా కల్పించారు,

# ఉపాధి కల్పన సవాలే కానీ..: నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

ప్రపంచం సవాళ్లను ఎదుర్కొంటున్న వేళ కూడా నూతన వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవడంలో భారత్ మెరుగైన స్థానంలో ఉందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. వస్తు, సేవల విభాగంలో అనేక దేశాలకు భారత్ కీలక భాగస్వామిగా మారాలని భావిస్తోందన్నారు. కొలంబియా యూనివర్సిటీలో నిర్వహించిన ఓ సదస్సులో పాల్గొన్న మంత్రి ఉపాధి కల్పన, ఆర్థిక వృద్ధి తదితర అంశాలపై మాట్లాడారు. దేశీయంగా సమర్థతను పెంచుకోవడంతో పాటు.. బయటి నుంచి వచ్చే సవాళ్లను తట్టుకొనేలా ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దాలని భావిస్తున్నట్లు సీతా రామన్ చెప్పారు. భారత్‌లోని పెట్టుబడి అవకాశాలను ఆమె ప్రస్తావించారు. ఉపాధి కల్పనే దేశం ముందున్న అతిపెద్ద సవాలన్నారు. "చాలా మంది యువత డిగ్రీ పట్టాలతో బయటకు వస్తున్నారు. కానీ, తమకున్న అర్హతకు, సాధించిన ఉద్యోగానికి మధ్య వ్యత్యాసం ఉందని వారు భావిస్తున్నారు. ఈ లోటును భర్తీ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. కృత్రిమ మేధ వంటి సాంకేతికతల్లో నైపుణ్యాన్ని అందించేందుకు యువతను సన్నద్ధం చేస్తోంది" అని ఆర్థిక మంత్రి అన్నారు. యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ గురించి ఆర్థిక మంత్రి ప్రస్తావించారు. భారత్ ప్లాస్టిక్ కార్డుల నుంచి క్యూఆర్ కోడ్‌కు వేగంగా మారినట్లు ఆమె తెలిపారు. చిరు దుకాణాలు, కూరగాయల కోసం కూడా దీనిని వినియోగిస్తున్నామన్నారు. ఫలితంగా చెల్లింపులు మరింత పారదర్శకంగా మారాయని, నగదుపై ఆధారపడటం తగ్గిందన్నారు. థర్మల్ పవర్ ప్రాజెక్ట్ నుంచి సౌరశక్తి వంటి పునరుత్పాదక ఇంధనం వైపు వేగంగా మారుతోందన్నారు.




# అనంతపురంలో 'పండమేరు' ఉద్ధృతి.. పూర్తిగా నీటమునిగిన కాలనీలు

అనంతపురం: అనంతపురంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో నగరానికి ఆనుకుని ఉన్న పండమేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వరదతో వాగుకు ఇరువైపులా ఉన్న కాలనీలు పూర్తిగా నీట మునిగాయి. వరద ప్రవాహం పెరుగుతుండడంతో ప్రజలు ఇళ్లపైకి ఎక్కి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. బాధిత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు యంత్రాంగం తరలిస్తోంది. పండమేరుకు వరద పోటెత్తడంతో ఉప్పరపల్లి పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీ నీట మునిగింది.

**హైదరాబాద్-బెంగళూరు రహదారిపై నిలిచిన రాకపోకలు..** కనగానపల్లి మండలంలోని ముక్తాపురం చెరువు అలుగు పారడంతో జాతీయ రహదారిపైకి వర్షపు నీరు చేరింది. దీంతో వాహనాలు నిలిచిపోయాయి. స్థానిక పెట్రోల్ బంక్‌లోకి నీరు చేరింది. కనగానపల్లి చెరువు కట్ట తెగి వరద పండమేరులోకి ఉధృతంగా ప్రవహిస్తోంది. పండమేరు వాగు ఉద్ధృతితో హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. నిన్న రాత్రి కురిసిన వర్షాలకు పుట్టపర్తి వద్ద చిత్రావతి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది.

# సర్టిఫికెట్ల కష్టాలకు చెక్.. వాట్సప్ ద్వారానే పౌర సేవలు: మంత్రి లోకేశ్



ఢిల్లీ: ఏపీలో పౌర సేవలు మరింత సులభతరం కానున్నాయి. ఈ మేరకు మెటా- ఏపీ ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. యువగళం హామీలు నెరవేర్చడంలో మెటాతో ఎంవోయూ చారిత్రాత్మక మైలురాయిగా అభివర్ణించారు. "విద్యార్థులు, నిరుద్యోగులు వివిధ సర్టిఫికెట్ల కోసం పడుతున్న కష్టాలు యువగళం పాదయాత్ర సందర్భంగా ప్రత్యక్షంగా చూశా. మొబైల్ ద్వారానే ఆయా సర్టిఫికెట్లు అందిస్తామని పాదయాత్రలో హామీ ఇచ్చా. ఇచ్చిన హామీ మేరకు వాట్సప్ ద్వారానే వివిధ రకాల సర్టిఫికెట్లు, పౌరసేవలు అందించేలా మెటాతో ఒప్పందం చేసుకున్నాం. రానున్న రోజుల్లో మరిన్ని సేవలు ఆన్‌లైన్‌లో అతి సులువుగా, పారదర్శకంగా, అతి వేగంగా పొందే ఏర్పాట్లు చేస్తాం" అని మంత్రి లోకేశ్ తెలిపారు.

**ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చాలా సంతోషం: మెటా ఇండియా...**
మెటాలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సేవలను వినియోగించుకుని వాట్సప్ ద్వారా ఏపీ ప్రజలకు పౌర సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని మెటా ఇండియా వైస్ ప్రెసిడెంట్ సంధ్యా దేవనాథన్ తెలిపారు.

ప్రజలు తమకు కావాల్సిన సేవలు పొందేందుకు వీలుగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, వాట్సప్ అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్ ఫేస్ ఉంటుందన్నారు. డిజిటల్ టెక్నాలజీని వాడుకుని ఏపీ ప్రభుత్వం ద్వారా ప్రజలకు మరిన్ని ఉత్తమ సేవలు అందించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. దిల్లీలోని 1 జన్‌పథ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మెటా సంస్థ ప్రతినిధులు రవిగార్గ్, నటాషా, ఆర్టీజీఎస్ సీఈవో దినేశ్, ఐఏఎస్ అధికారి పాల్గొన్నారు.

# ఏ సీఎం చేయని పనులు జగన్ చేశారు.. మంత్రి గొట్టిపాటి ఫైర్



ప్రకాశం, అక్టోబర్ 22: గత వైసీపీ ప్రభుత్వ పాలనపై, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో శాంతి భద్రతలు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఏ ముఖ్యమంత్రి చేయని దుర్మార్గపు పనులు గత ఐదేళ్లలో జగన్ చేశారని విమర్శించారు. అందుకే ప్రజలు వైసీపీని 11 సీట్లకి పరిమితం చేశారని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన తరువాత శాంతి భద్రతలు పటిష్టం చేస్తున్నామని వెల్లడించారు. వైసీపీ నాయకులు దుర్మార్గపు పనులు చేసి తమపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ముంబాయి హీరోయిన్‌ను తీసుకువచ్చి పోలీసులతో వేధించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంకా కొంతమంది నుంచి ఆ వాసన పోలేదన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో అన్ని రంగాల నుంచి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని.. 20 ఏళ్ల క్రితమే ముందు చూపుతో ముఖ్యమంత్రి చంద్రబాబు టెక్నాలజీని అభివృద్ధి చేశారన్నారు. విద్యుత్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చేందుకు చంద్రబాబు పని చేస్తున్నారన్నారు. వైసీపీ చేసే కుట్రల్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. పీపీఏలను రద్దు చేసి గత ప్రభుత్వంలో బయట నుంచి విద్యుత్ కొనుగోలు చేశారని.. విద్యుత్ సంస్థలు వైసీపీ ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాయని తెలిపారు. ఆ భారమే ఇప్పుడు ప్రజలు మోస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఒక్కరూపాయి కూడా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో జగన్ చేసిన అరాచకాల వలన రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు సర్వనాశనం అయ్యాయన్నారు. జగన్ ప్రభుత్వంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందన్నారు. చంద్రబాబు సీఎం అయిన మొదటి రోజు నుంచే రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు పని చేస్తున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.


# శ్రీశైలంలో కార్తీక మాసోత్సవాలు ఎప్పటినుంచంటే..



నంద్యాల, అక్టోబర్ 22: నంద్యాల జిల్లా శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి పుణ్యక్షేత్రం దేవీనవరాత్రులు అంగరంగవైభవంగా ముగిశాయి. ఇప్పుడు కార్తీక మాసోత్సవాలకు శ్రీశైలం క్షేత్రం ముస్తాబవుతోంది. శ్రీశైలంలో నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1 వరకు కార్తీక మాసోత్సవాలు జరుగనున్నాయి. ఈ మేరకు మంగళవారం ఉదయం ఉత్సవాలకు సంబంధించిన వివరాలను ఈవో చంద్రశేఖర్ రెడ్డి మీడియాకు తెలియజేశారు. కార్తీకమాసమంతా శ్రీశైలంలో గర్భాలయ అభిషేకాలు పూర్తిగా నిలుపుదల చేశామని వెల్లడించారు. శని, ఆది, సోమవారం కార్తీక పౌర్ణమి, ఏకాదశి రోజులలో స్వామివారి స్పర్శ దర్శనం అలంకార దర్శనానికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. రద్దీ రోజులలో మినహా మిగిలిన రోజులలో విడతల వారిగా సామూహిక అభిషేకాలకు అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు చెప్పారు. రద్దీ రోజులలో అమ్మవారి అంతరాలయంలో కుంకుమార్చన, పూజలు తాత్కాలికంగా నిలుపుదల చేసి.. అమ్మవారి ఆశీర్వచన మండపంలో కొనసాగింపు ఉంటుందన్నారు. కార్తీక దీపారాధనకు భక్తులకు ఆలయ ఉత్తర మాడవీధిలో ఏర్పాటుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. నవంబర్ 15న కార్తీక పౌర్ణమి కావడంతో కృష్ణమ్మకు పుణ్య నదిహారతి, సారే సమర్పణ, జ్వాలతోరణం కార్యక్రమం ఉంటుందని ఈవో చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.

# ఏపీలో పలుచోట్ల డిస్టిలరీల్లో సీఐడీ తనిఖీలు

అమరావతి: ఏపీలో పలుచోట్ల డిస్టిలరీల్లో సీఐడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడి సమీపంలో ఉన్న ఎస్వీఆర్ డిస్టిలరీస్‌పై దాడులు నిర్వహించారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలోని విశాఖ, జీఎస్వీ డిస్టిలరీస్‌లో తనిఖీలు చేపట్టారు. ప్రకాశం జిల్లా సింగారయకొండ మండలం పాత సింగరాయకొండ పరిధిలోని పెరల్ డిస్టిలరీని అధికారులు తనిఖీలు చేశారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం గండేపల్లి సెంటనీ బయోటెక్ కర్మాగారంలో మద్యం బాటిలింగ్ యూనిట్‌లో సీఐడీ అధికారుల సోదాలు నిర్వహించారు. మరోవైపు నంద్యాలలో ఎస్పీవై అగ్రో ఇండస్ట్రీస్‌ను సీఐడీ అధికారులు పరిశీలించారు. సంస్థపై పలు ఆరోపణలు రావడంతో సీఐడీ అదనపు ఎస్పీ హుస్సేన్ పీర ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. సుమారు 30 మంది అధికారులు పాల్గొన్నారు. కడప శివారులోని ఈగల్ డిస్టిలరీ కేంద్రంలో సీఐడీ సోదాలు కొనసాగుతున్నాయి. తిరుపతి నుంచి వచ్చిన సీఐడీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఏడాది నుంచి ఈ కేంద్రంలో ఎంత మొత్తంలో మద్యం తయారు చేశారనేదానిపై రికార్డులు పరిశీలిస్తున్నారు. చిత్తూరు జిల్లా కుప్పంలోని డిస్టిలరీ పరిశ్రమలో కూడా సీఐడీ సోదాలు కొనసాగుతున్నాయి.



## దేవర.. ఈమె జాన్వీ కంటే అందంగా..

సాధారణంగా ఏ సినిమాలో అయినా హీరోల తర్వాత హీరోయిన్లే బాగా అందంగా కనిపిస్తూ ఉంటారు. కానీ, కొన్ని కొన్ని సినిమాల్లో మాత్రం ఫీమేల్ లీడ్స్ కంటే అందులో నటించిన క్యారెక్టర్ ఆర్టిస్టులు బాగా హైలైట్ అవుతుంటారు. మరికొన్ని చిత్రాల్లో మాత్రం హీరోయిన్లతో సమానంగా ప్రత్యేక ఆకర్షణ అవుతుంటారు. ఇప్పుడు అలా అయిన వారిలో 'దేవర' సినిమాలో నటించిన శృతి మరాఠే ఒకరు. యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ తెరకెక్కించిన చిత్రమే 'దేవర'. ఫుల్ లెంగ్త్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ చిత్రం అద్భుతమైన స్పందనను అందుకుని సత్తా చాటుకుంది. ఫలితంగా కోట్ల వసూళ్లను సాధించి సూపర్ డూపర్ హిట్‌గా నిలిచింది. ఇందులో ఎన్టీఆర్ డుయల్ రోల్‌లో నటించగా.. అతడికి జంటగా జాన్వీ కపూర్‌తో పాటు శృతి మరాఠే అని కూడా నటించింది. 'దేవర' చిత్రంలో తండ్రిగా నటించిన జూనియర్ ఎన్టీఆర్‌కు శృతి మరాఠే భార్యగా నటించింది. ఇందులో ఆమె ఎంతో డీసెంట్‌గా కనిపించినప్పటికీ.. నందమూరి అభిమానులతో పాటు సినీ ప్రియులను ఫిదా చేసేసింది. ఒకవైపు జాన్వీ కపూర్ తనదైన అందాల ఆరబోతతో హైలైట్ అవగా.. శృతి మరాఠే మాత్రం అచ్చ



తెలుగు భామలా పద్ధతైన చీరకట్టులోనే కనికట్టు చేసింది. మరీ ముఖ్యంగా కొన్ని సన్నివేశాల్లో అద్భుతమైన నటన, హావభావాలతో మాయ చేసింది. దీంతో అసలు ఈ అమ్మడు ఎవరు అని చాలా మంది ఇంటర్నెట్ వేదికగా వెతుకులాట ప్రారంభించారు. శృతి మరాఠే గుజరాత్‌కు చెందిన నటి. ఆమె 'సనాయి చౌగదే' అనే మరాఠి సినిమాతో నటిగా ప్రయాణాన్ని మొదలు పెట్టింది. ఆ తర్వాత హిందీ, కన్నడం, గుజరాతీ, తమిళ భాషల్లో చాలా చిత్రాల్లో నటించింది. ఈ క్రమంలోనే ప్రముఖ సీరియల్ హీరో గౌరవ్ ఘట్నేకర్‌కు వివాహం చేసుకుంది. అలాగే, చాలా సీరియళ్లలో సైతం నటించి ఫేమస్ అయింది. ఇప్పుడు ఈ చిన్నదే 'దేవర' చిత్రంతో టాలీవుడ్‌లోనూ తనదైన మార్కును చూపించింది.

38 ఏళ్ల శృతి మరాఠే వరసగా సినిమాలు చేస్తూనే సోషల్ మీడియాలోనూ ఓ రేంజ్‌లో యాక్టివ్‌గా ఉంటోంది. ఇందులో తనదైన అందచందాలతో నెటిజన్లను మాయ చేసేస్తోంది. మరీ ముఖ్యంగా అప్పుడప్పుడూ గ్లామరస్ ఫొటోలు, వీడియోలను కూడా షేర్ చేస్తోంది. ఇలా ఈ మధ్య కాలంలో రెచ్చిపోయి రచ్చ చేస్తోంది. దీనికితోడు 'దేవర' వంటి పాన్ ఇండియా చిత్రం ద్వారా ఇప్పుడు శృతి మరాఠే దేశ వ్యాప్తంగా ట్రెండింగ్‌లో నిలుస్తోంది.

## 'సప్తసాగరాలు' పాప.. ఎంత క్యూట్ గా ఉందో..

'సప్తసాగరాలు దాటి' మూవీతో హీరోయిన్ గా అందరి దృష్టిని ఆకర్షించిన బ్యూటీ రుక్మిణి వసంత్. ఈ కన్నడ భామకి 'బీర్బల్' అనే సినిమాతో హీరోయిన్ గా తెరంగేట్రం చేసింది. తరువాత హిందీలో 'అప్ స్టైర్స్' అనే మూవీలో నటించింది. అయితే రక్షిత్ శెట్టికి జోడీగా చేసిన 'సప్తసాగరాలు దాటి సిరీస్' మాత్రం ఆమెకి స్టార్ హీరోయిన్ ఇమేజ్ తీసుకొచ్చింది. ఈ సినిమా తర్వాత వెనక్కి తిరిగిచూసుకునే అవకాశం లేకుండా వరుస ఛాన్స్ లు అందుకుంటుంది. కన్నడంలో శ్రీమురళీకి జోడీగా 'భఘీర సినిమాలో రుక్మిణి వసంత్ నటించింది. ఈ మూవీ రిలీజ్ కి రెడీ అవుతోంది. మరో వైపు తెలుగులో నిఖిల్ కి జోడీగా 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' అనే చిత్రంలో నటిస్తోంది. సుధీర్ వర్మ దర్శకత్వంలో ఈ మూవీ తెరకెక్కుతోంది. ఇక కన్నడంలో శివరాజ్ కుమార్ తో 'భారతీ రంగల్' చిత్రంలో చేస్తోంది. వీటితో పాటు తమిళంలో విజయ్ సేతుపతికి జోడీగా 'ఏస్' అనే మూవీలో నటిస్తోంది. అలాగే శివ కార్తికేయన్ హీరోగా మురుగదాస్ దర్శకత్వంలో



తెరకెక్కుతోన్న చిత్రంలో కూడా హీరోయిన్ గా కన్ఫర్మ్ అయ్యింది. ఇలా ప్రస్తుతం రుక్మిణి వసంత్ చేతిలో అరడజను సినిమాల వరకు ఉన్నాయి. ఇదిలా ఉంటే ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలో హీరోయిన్ గా రుక్మిణి వసంత్ పేరు వినిపిస్తోంది. ఇప్పటికే ఆమె ప్రాజెక్ట్ కోసం సైన్ చేసిందని టాక్ నడుస్తోంది. ఇలా చేతినిండా ప్రాజెక్ట్స్ తో రుక్మిణి వసంత్ హీరోయిన్ గా స్టార్ ఇమేజ్ దిశగా దూసుకుపోతోంది. తెలుగులో కూడా చాలా ప్రాజెక్ట్స్ కోసం ఈమె పేరు వినిపిస్తోంది. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో రుక్మిణి చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా తన మూవీ అప్డేట్స్ తో గ్లామర్ ఫోటోలని కూడా షేర్ చేస్తూ ఉంటుంది. ఈ ఫోటోలకి ఆమె ఫ్యాన్స్ తో పాటు నెటిజన్లు నుంచి అదిరిపోయే రేంజ్ లో కామెంట్స్ వస్తాయి. తాజాగా ఇన్ స్టాగ్రామ్ లో రుక్మిణి వసంత్ సోఫా చైర్ లో కూర్చొని ప్యాంటు, టాప్ తో ఉన్న ఒక ఫోటోలు షేర్ చేసింది. ఈ ఫోటోలో రుక్మిణి చాలా స్టైలిష్ గా కనిపిస్తోంది. లుక్స్ తో మెస్మరైజ్ చేస్తోంది. ఈ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.




## 'లక్కీ భాస్కర్' ట్రైలర్: డ్రగ్స్ ఇచ్చే కిక్ కన్నా, డబ్బు ఇచ్చే కిక్ ఎక్కువ!




'మహానటి' మూవీతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్.. 'సీతారామం' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టాడు. ఈ క్రమంలో 'కల్కి 2898 ఏడీ' మూవీలో క్యామియోతో సర్ప్రైజ్ చేసాడు. ఇప్పుడు 'లక్కీ భాస్కర్' చిత్రంతో అలరించడానికి రెడీ అయ్యారు. 'సార్' ఫేమ్ వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ పాన్ ఇండియా సినిమాలో మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటించింది. ఇప్పటికే పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం, దీపావళి కానుకగా థియేటర్లలో విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో తాజాగా మూవీ ట్రైలర్ ను మేకర్స్ ఆవిష్కరించారు. 'లక్కీ భాస్కర్' నుంచి ఇప్పటికే బయటకు వచ్చిన ప్రమోషనల్ మెటీరియల్ కు ఆడియన్స్ నుంచి అనూహ్య స్పందన లభించింది. టీజర్, సాంగ్స్ సినిమాకు మంచి బజ్ తెచ్చిపెట్టాయి. రిలీజ్ డేట్ దగ్గర పడటంతో మేకర్స్, ప్రమోషన్స్ లో భాగంగా సోమవారం సాయంత్రం హైదరాబాద్ లో గ్రాండ్ గా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన థియేట్రికల్ ట్రైలర్ విశేషంగా ఆకట్టుకుంటోంది.. సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. "నా పేరు భాస్కర్ కుమార్.. నా జీతం 6 వేల రూపాయలు.. దరిద్రంలో బ్రతుకుతున్నాను.. నేనే కావాలని నన్ను చేసుకుంది సుమతి.. నా బలం, నా భార్య" అంటూ దుల్కర్ సల్మాన్ తన గురించి చెప్పే డైలాగ్ తో ఈ ట్రైలర్ ప్రారంభమైంది. తమ బిడ్డతో కలిసి జీవిస్తూ.. ఉద్యోగంలో ప్రమోషన్ వస్తే కష్టాలన్నీ తీరిపోతాయి అని ఎదురు చూసే మధ్యతరగతి భార్యా భర్తలుగా దుల్కర్, మీనాక్షి జంట కనిపించారు. అయితే డబ్బు లేని కారణంగా వారు ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నట్లు ట్రైలర్ లో చూపించారు. ఫ్యామిలీ కోసం ఏమైనా చేయాలి, ఎంత రిస్క్ అయినా చేసి ఎలాగైనా డబ్బు సంపాదించాలని డిసైడైన భాస్కర్.. తన తెలివితో వేరే ఇతర మార్గాల్లో డబ్బున్న వాడిగా ఎదిగినట్లు తెలుస్తోంది. అయితే డబ్బు వచ్చిన తర్వాత భార్యా భర్తల మధ్య మనస్పర్థలు మొదలైనట్లు కనిపిస్తోంది. "ఐ యామ్ నాట్ ఏ చీటర్.. ఐ యామ్ జస్ట్ రిచ్" అంటూ భాస్కర్ తన భార్యతో గొడవ పడటాన్ని మనం చూడొచ్చు. ఓవరాల్ గా ఉన్నత శిఖరాలకు చేరిన ఒక సాధారణ బ్యాంక్ క్యాషియర్ జీవిత ప్రయాణాన్ని ఈ ట్రైలర్ ఆవిష్కరించింది. 'లక్కీ భాస్కర్' ట్రైలర్ అంతా డబ్బు చుట్టూనే తిరిగింది. "జూదంలో ఎంత బాగా ఆడావ్ అనేది ముఖ్యం కాదు, ఎప్పుడు ఆపేశావ్ అన్నదే ముఖ్యం", "సిగరెట్, ఆల్కహాల్, డ్రగ్స్ ఇచ్చే కిక్ కన్నా.. డబ్బు ఇచ్చే కిక్ ఎక్కువ", "ఇది ఇండియా.. వస్తువు కావాలంటే డబ్బుతో కొనాలి. రెస్పెక్ట్ కావాలంటే అ డబ్బు మన ఒంటి మీద కనపడాలి" వంటి డైలాగ్స్ ఆకట్టుకుంటున్నాయి.

90వ దశకంలో స్టాక్ మార్కెట్ లో జరిగిన స్కామ్ నేపథ్యంలో ఈ సినిమా రూపొందినట్లు తెలుస్తోంది. సినిమా బ్యాక్ డ్రాప్ కి తగ్గట్టుగా విజువల్స్ ఉన్నాయి. బ్యాగ్రౌండ్ స్కోర్ కూడా బాగుంది. 'సార్' సినిమాతో ఆకట్టుకున్న వెంకీ అట్లూరి.. 'లక్కీ భాస్కర్' చిత్రంలో మధ్యతరగతి జీవితాల్లో డబ్బు ప్రభావాన్ని చూపించబోతున్నట్లు అర్థమవుతోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్ పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం సమకూర్చారు. నిమిష్ రవి సినిమాటోగ్రఫీ నిర్వహించగా.. నవీన్ నూలి ఎడిటింగ్ చేసారు. బంగ్లాన్ ఆర్ట్ డైరెక్టర్ గా బాధ్యతలు నిర్వహించారు. 'లక్కీ భాస్కర్' చిత్రాన్ని అక్టోబర్ 31న తెలుగు తమిళ మలయాళ హిందీ భాషల్లో గ్రాండ్ గా విడుదల చేయనున్నారు.

## ట్రైలర్ టాక్: విశ్వక్ పక్కా మాస్ మసాలా 'మెకానిక్ రాకీ'




మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే చిత్ర బృందం ప్రమోషనల్ కార్యక్రమాలను మొదలుపెట్టింది. టీజర్, సాంగ్స్ జనాలను ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ మూవీ ట్రైలర్ 1.0 ను మేకర్స్ రిలీజ్ చేసారు. "నువ్వు ఏం ఫికర్ చెయ్యకు నాన్నా.. ఎట్లయినా నేను సివిల్ ఇంజనీర్ అయిపోతా" అంటూ విశ్వక్ సేన్ అంటుండగా.. "ఏంటి, కంప్యూటర్ సైన్స్ చదివి సివిల్ ఇంజినీర్ అవుతా?" అంటూ సీనియర్ నరేశ్ ఆశ్చర్యంగా ప్రశ్నించడంతో ఈ ట్రైలర్ ప్రారంభమైంది. అక్కడి నుంచి ఆద్యంతం ఫన్నీ సీన్స్ తో ఆకట్టుకునేలా సాగింది. మెకానిక్ షెడ్ నిర్వహిస్తున్న నరేశ్.. తన కొడుకు దేనికీ పనికి రాడని చెబుతూ, చివరకు డ్రైవింగ్ స్కూల్ బాధ్యతలు విశ్వక్? కు అప్పజెపుతాడు. విశ్వక్ దగ్గరకు డ్రైవింగ్ నేర్చుకోడానికి హీరోయిన్లు శ్రద్ధా శ్రీనాథ్?, మీనాక్షి చౌదరి వచ్చారు. శ్రద్ధాకి డ్రైవింగ్ నేర్పించడానికి చిరాకు పడుతున్న మన మెకానిక్ రాకీ.. మీనాక్షికి పర్ఫెక్ట్ గా డ్రైవింగ్ నేర్పిస్తానంటూ లవ్ ట్రాక్ ఎక్కించడానికి ట్రై చేస్తున్నాడు. ఏదొక వంకతో ఆమెను తాకడం.. గిఫ్టులు ఇవ్వడం వంటివి చేస్తూ ఇంప్రెస్ చెయ్యాలని చూస్తున్నాడు. ఆఖరికి అంబేద్కర్ జయంతికి కూడా ఆమెకు గిఫ్ట్ తెచ్చానని చెప్పడం నవ్వు తెప్పిస్తుంది. అయితే ట్రైలర్ శ్రద్ధా శ్రీనాథ్? ను విశ్వక్ కిస్ చేయడానికి ట్రై చేస్తుండటం చూస్తే, వీరి మధ్య కూడా లవ్ ట్రాక్ ఉందేమో అనే సందేహం కలుగుతుంది. విలన్ గా సునీల్ ఎంట్రీతో ట్రైలర్ యాక్షన్ మోడ్ లోకి మారుతుంది. మెకానిక్ షెడ్? విషయంలో హీరో తండ్రి నరేష్, సునీల్ మధ్య ఏదో సమస్య వచ్చినట్లుగా తెలుస్తోంది. షెడ్ కోసమే హీరో – విలన్ మధ్య వైరం మొదలైనట్లు కనిపిస్తోంది. అక్కడి నుంచి రంగంలోకి దిగిన విశ్వక్ సేన్ తనదైన శైలిలో మాస్ డైలాగ్స్ చెబుతూ, యాక్షన్ సీన్స్ తో ఆకట్టుకున్నాడు. 'రిపేరుకు వస్తే ఫ్రీగా సర్వీసింగ్ చేస్తా.. సౌండ్ ఎక్కువైతే బోర్ చేస్తా. అంతకు మించి మొండికి వేస్తే మాత్రం ఒక్కొక్కడి ఇంజిన్ తీసి బిగిస్తా' 'నువ్వు రంకి రెడ్డి అయితే నేను రంకు రెడ్డి' అంటూ సునీల్? కు విశ్వక్ మాస్ వార్నింగ్ ఇస్తాడు. గుత్తి.. కూష్మాండం.. ఎర్రిపు.. వంటి పదాలు ఈ డైలాగ్స్ లో వినిపిస్తాయి. ఓవరాల్ గా పక్కా మాస్ మసాలా కమర్షియల్ ఎంటర్టైనర్ గా 'మెకానిక్ రాకీ' రెడీ అవుతోందని ట్రైలర్1.0 తోనే క్లారిటీ వచ్చేసింది. విశ్వక్ సేన్ ఎప్పటిలాగే తన మార్క్ డైలాగ్ డెలివరీతో.. కామెడీతో పాటు యాక్షన్ సీన్స్ లోనూ అదరగొట్టాడు. శ్రద్ధా శ్రీనాథ్ మోడరన్ అమ్మాయిగా కనిపించగా.. మీనాక్షి చౌదరి సాధారణ యువతిగా కనిపించింది.

హర్ష వర్ధన్, వైవా హర్ష ఇతర పాత్రల్లో కనిపించారు. సునీల్ మరోసారి తన విలనీతో మెరిశారు. ట్రైలర్ లో 'క్లాస్ మెచ్చిన మాస్ మెకానిక్' అంటూ వచ్చే బ్యాగ్రౌండ్ మ్యూజిక్ ఆకట్టుకుంది. 'మెకానిక్ రాకీ' చిత్రాన్ని రామ్ తాళ్లూరి సమర్పణలో ఎస్ఆర్‌టి ఎంటర్టైన్‌మెంట్ బ్యానర్ పై రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. జేక్స్ బెజోయ్ సంగీతం సమకూరుస్తున్నారు. మనోజ్ రెడ్డి సినిమాటోగ్రఫీ నిర్వహించగా.. అన్వర్ అలీ ఎడిటింగ్ వర్క్ చేస్తున్నారు. వాస్తవానికి ఈ సినిమాని దీపావళి కానుకగా విడుదల చెయ్యాలని అనుకున్నారు. కానీ చివరకు 2024 నవంబర్ 22న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

## పుష్ప 2: ఆఖరికి బడా హీరోయిన్ రంగంలోకి..


ఒకప్పుడు ఇండియా అంటే సినిమా రంగంలో బాలీవుడ్ గురించే ఎక్కువగా చెప్పుకునే వారు. కానీ, ఈ మధ్య కాలంలో సౌత్ ఇండియన్ సినిమా రంగాల హవా కూడా కనిపిస్తోంది. ముఖ్యంగా టాలీవుడ్ రేంజ్ భారీ స్థాయిలో పెరిగిపోయింది. దీనికి ఎన్నో చిత్రాలు దోహదం చేశాయి. అలాంటి వాటిలో 'పుష్ప ది రైజ్' ఒకటి. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా నటించిన ఈ చిత్రం సంచలనమే సృష్టించింది. గంధపు చెక్కల స్మగ్లింగ్ నేపథ్యంతో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన 'పుష్ప ది రైజ్' మూవీ పాన్ ఇండియా రేంజ్‌లో సక్సెస్ సాధించడంతో.. దీనికి సీక్వెల్‌గా 'పుష్ప ది రూల్' మూవీని తీస్తున్నారు. ఇందులో పుష్పరాజ్ రూలర్‌గా మారడాన్ని చూపించబోతున్నారు. దీంతో ఈ చిత్రంపై హైప్ అదిరిపోయేలా పెరిగిపోతోంది. అందుకు తగ్గట్లుగానే దీన్ని గతంలో కంటే ఉన్నతంగా రూపొందిస్తున్నారు. ఫుల్ లెంగ్త్ యాక్షన్‌తో క్రేజీ కాంబినేషన్‌లో వచ్చిన 'పుష్ప ది రైజ్' మూవీలో సమంత రూత్ ప్రభు చేసిన స్పెషల్ సాంగ్ ఏ రేంజ్‌లో హిట్ అయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ పాట దేశ వ్యాప్తంగా ఓ ఊపు ఊపేసింది. దీంతో ఇప్పుడు ఎన్నో అంచనాల నడుమ రూపొందనున్న 'పుష్ప ద రూల్' మూవీలో కూడా అదిరిపోయే ఐటెం



సాంగ్‌ను పెట్టబోతున్నట్లు ఇప్పటికే సమాచారం బయటకు వచ్చేసింది. 'పుష్ప ది రూల్' సినిమాలో బాలీవుడ్ బ్యూటీతోనే స్పెషల్ సాంగ్ చేయించబోతున్నారని ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే జాన్వీ కపూర్, త్రిప్తి డిమ్రీ, మలైకా అరోరా, సమంత, పూజా హెగ్డే సహా ఎంతో మంది హీరోయిన్ల పేర్లు తెరపైకి వచ్చాయి. కానీ, వీళ్లెవరూ కన్ఫార్మ్ కాలేదు. అయితే, తాజా సమాచారం ప్రకారం.. ఈ చిత్రంలో స్పెషల్ సాంగ్ కోసం శ్రద్ధా కపూర్‌ను ఫైనల్ చేశారట. అల్లు అర్జున్ – సుకుమార్ కలయికలో రూపొందుతోన్న 'పుష్ప ది రూల్' సినిమాలో స్పెషల్ సాంగ్‌ను చేసేందుకు శ్రద్ధా కపూర్ ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. త్వరలోనే ఆమె షూటింగ్‌లో కూడా పాల్గొనబోతుందని తెలిసింది. ఇప్పటికే దీనికి సంబంధించిన ట్యూన్స్‌ను కూడా మ్యూజిక్ డైరెక్టర్ దేవీ శ్రీ ప్రసాద్ కంపోజ్ చేశాడని కూడా వార్తలు వస్తున్నాయి. దీంతో ఈ పాటపై అందరిలోనూ అంచనాలు పెరిగిపోతున్నాయి. 'పుష్ప ది రూల్' సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. రష్మిక మందన్నా ఇందులో హీరోయిన్‌గా నటిస్తుండగా.. మలయాళ స్టార్ హీరో ఫహద్ ఫాసిల్, సునీల్, అనసూయ ఈ చిత్రంలో నెగెటివ్ రోల్స్‌లో కనిపించారు. దేవీ శ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతాన్ని ఇస్తున్నాడు. డిసెంబర్ 6వ తేదీన ఇది విడుదల కాబోతుంది.

## క్లీవేజ్ బ్యూటీతో కాక పుట్టించేలా!

బాలీవుడ్ లో ఎంతమంది అందగంత్తులున్నా! త్రిప్తీ డిమ్రీ తర్వాతే అన్నంత గా అమ్మడు ఫేమస్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఒకే ఒక్క హిట్...చిన్న రోల్ అయినా త్రిప్తిని తారా స్థాయికి తీసుకెళ్లింది యానిమల్. పాన్ ఇండియాలో అమ్మడి క్రేజ్ ఇప్పుడు మామూలుగా లేదు. ఒక్క హిట్ తో లైఫ్ టర్న్ అయిపోయింది. బాలీవుడ్ లో బిజీ నటీమణిగా మారిపోయింది. అప్పటి నుంచి నెట్టింట త్రిప్తి ఎలాంటి ఫోటో అప్ లోడ్ చేసినా హాట్ టాపిక్ గా మారుతోంది. అమ్మడు ఫ్యాషన్ ఎంపికల్లో తనదైన బ్రాండ్ వేస్తుంది. అదే ఫాలోయింగ్ పీక్స్ లో ఉంటే ఇంకే రేంజ్ లో చెలరే గుతుందో చెప్పాల్సిన పనిలేదు. ఏడెనిమిది నెలలుగా త్రిప్తీ ఈ రకమైన యాంగిల్ లోనే నెట్టింట హాట్ టాపిక్ గా మారుతుంది. ఇన్ స్టా వేదికగా డిజైనర్ దుస్తుల్లో దూరిన ఫోటోల్ని వదులుతోంది. తనదైన మార్క్ ఎలివేషన్లతో ఆకట్టుకుంటోంది. తాజాగా అమ్మడు మరో స్టైలిష్ పిక్ తో నెట్టింట్లోకి వచ్చేసింది. ఇదిగో ఇక్కడిలా బ్లేజర్ డిజైన్ ని పోలిని దుస్తుల్లో సెగలు పుట్టిస్తుంది. ఇదే డిజైన్ లో అమ్మడు పర్ఫెక్ట్ క్లీవేజ్ బ్యూటీని ఆవిష్కరించింది. లో దుస్తులు హైలైట్ అయ్యేలా? కెమెరాకి



ఫోజులిచ్చింది. మెడలో ధరించిన రింగ్...మ్యాచింగ్ చెవులకు ధరించిన రింగులు..ఇతర అలంకరణ ప్రతీది సొసగరి లో బ్యూటీని మరింత హైలైట్ చేస్తున్నాయి. త్రిప్తీ కళ్లలో బ్యూటీ మరోసారి సంథింగ్ స్పెషల్. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. ఇక త్రిప్తీ డిమ్రీ ఇటీవలే 'బ్యాడ్ న్యూజ్' తో మరో సక్సెస్ ని ఖాతాలో వేసుకుంది. అటుపై రిలీజ్ అయిన విక్కీ విద్యా ఫెయిలైనా? ఆ ప్రభావం అమ్మడిపై పెద్దగా పడలేదు. త్వరలో భూల్ భులయ్యా–3 తో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతోంది. ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. రెండు భాగాలు మంచి విజయం సాధించిన నేపథ్యంలో పార్ట్ – 3కూడా విజయం సాధిస్తుందని అంచనాలున్నాయి. అలాగే ధడక్–2లోనూ అమ్మడు హీరోయిన్ గా నటిస్తోంది.





# కాళేశ్వరంపై మళ్లీ క్రాస్ ఎగ్జామినేషన్

హైదరాబాద్: కాళేశ్వరం వ్యవహారంలో రేపటి నుంచి మళ్లీ క్రాస్ ఎగ్జామినేషన్ జరగనుంది.

ఇంజినీర్లు, విశ్రాంత ఇంజినీర్లు, ఉన్నతాధికారులను న్యాయ విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ విచారించనున్నారు. గతంలో విచారణ చేసిన వారిని కూడా మళ్లీ పిలవనున్నారు. ఈనెల 29 వరకు క్రాస్ ఎగ్జామినేషన్ కొనసాగనుంది. మంగళవారం నీటిపారుదలశాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. వీలైనంత త్వరగా తుది నివేదిక ఇవ్వాలని విజిలెన్స్ డీజీని జస్టిస్ పీసీ ఘోష్ ఆదేశించారు. ఆనకట్టలు నిర్మించిన సంస్థల ప్రతినిధులనూ జస్టిస్ పీసీ ఘోష్ విచారించనున్నారు.

నిర్మాణానికి సంబంధించిన అన్ని రికార్డులు, సంస్థల లావాదేవీల వివరాలను కమిషన్ పరిశీలించనుంది. అఫిడవిట్ దాఖలు చేసిన వి. ప్రకాశ్‌ను కూడా విచారించనుంది. ఎన్డీఎస్ఏ, కాగ్ నివేదికల ఆధారంగా విచారణ జరగనుంది.

# ఎస్సీ వర్గీకరణ అమలయ్యే వరకు గ్రూప్-3, గ్రూప్-2 వాయిదా వేయండి..

## సీఎం రేవంత్‌కు ఎస్సీ విద్యార్థుల లేఖ



రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు జరిగే వరకు గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను వాయిదా వేసి న్యాయం చేయాలని ఎస్సీ సామాజిక విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రాలు వర్గీకరణను అమలు చేయాలని భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యులు ధర్మాసనం చారిత్రాత్మక తీర్పు ఇచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్ వర్గీకరణ తక్షణమే అమలు చేస్తామని.. త్వరలో జరుగబోయే పరీక్షల్లోనూ వర్గీకరణ అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలులో న్యాయపరమైన చిక్కులు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం 12/10/2024 రోజున జస్టిస్ షమీం అక్తర్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసి 60 రోజుల్లో నివేదిక ఇవ్వాలని జీవో జారీ చేసిందన్నారు. ఈ క్రమంలో దాదాపు ఎన్నో ఏళ్ల నుంచి వర్గీకరణ ఫలాలకు దూరంగా వివక్షకు గురవుతున్న ఎస్సీ సామాజిక ఉపకులాలకు గొప్ప అవకాశం వర్గీకరణ అని తెలిపారు. వర్గీకరణ అమలులోకి వచ్చిన తర్వాతే రాబోయే గ్రూప్-3, గ్రూప్-2 పరీక్షలు నిర్వహించాలని.. ఎస్సీ సామాజిక వర్గ ఉపకులాలకు రిజర్వేషన్లు దక్కేలా చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ప్రకారం రాబోయే నోటిఫికేషన్‌లో ఇంత పెద్ద మొత్తంలో ఖాళీల సంఖ్య ఉండకపోవచ్చని.. వర్గీకరణ అమలు జరిగే వరకు పరీక్షలు వాయిదా వేయాలని.. అదనంగా పోస్టులు కలిపి మిగతా సామాజిక వర్గాలకు న్యాయం చేయాలని కోరారు.

# ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ముఖ్య అనుచరుడి దారుణహత్య



జగిత్యాల: కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, మాజీ ఎంపీటీసీ మారు గంగారెడ్డి (58) దారుణహత్యకు గురయ్యారు. జగిత్యాల జిల్లా జాబితాపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం సంతోష్ అనే వ్యక్తి గంగారెడ్డిని కారుతో ఢీకొట్టాడు. ఆ తర్వాత కత్తితో పొడిచాడు. తీవ్రగాయాలపాలైన గంగారెడ్డిని స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ఈ హత్యకు నిరసనగా జగిత్యాల పాతబస్టాండ్ వద్ద తన అనుచరులతో కలిసి జీవన్‌రెడ్డి ధర్నాకు దిగారు. కాంగ్రెస్ నాయకులకు రక్షణ లేనప్పుడు తామెందుకని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం.. జగిత్యాలలో భారాస ప్రభుత్వమా? అని మండిపడ్డారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వ్యాఖ్యలపై స్పందించిన కేటీఆర్



హైదరాబాద్: తెలంగాణలో శాంతిభద్రతలు లేవని గత కొన్ని నెలలుగా అందరూ చెబుతున్న మాటనే ఇవాళ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అంటున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. జగిత్యాలలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రానికి పూర్తి స్థాయి హోంమంత్రి లేకపోగా.. పోలీసులు రాజకీయ వ్యవహారాల్లో పూర్తిగా బిజీగా ఉండటంతో శాంతి భద్రతల అమలు కుంటుపడిందని కేటీఆర్ ఆరోపించారు. రాజకీయ పెద్దలు ఇకనైనా విజ్ఞతతో ఆలోచిస్తారని అనుకుంటున్నట్లు తెలిపారు. శాంతి, సామరస్యాన్ని కాపాడే ప్రాథమిక పనిపై దృష్టి సారించేలా సమర్థులైన పోలీసులు అధికారులకు స్వేచ్ఛ ఇస్తారని ఆశిస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

# ఎవరో దుండగులు మా ర్యాలీలో చొరబడి కుట్ర చేశారు: ఈటల రాజేందర్



హైదరాబాద్: ఎవరో దుండగులు తమ ర్యాలీలో చొరబడి కుట్ర చేశారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఇటీవల సికింద్రాబాద్‌లో ప్రశాంత వాతావరణంలో ర్యాలీ నిర్వహించాం. భాజపా కార్యకర్తల ముసుగులో కొందరు చేరి రాళ్లు, చెప్పులు విసిరారు. పారిపోతున్న వారిని పట్టుకుని మరీ పోలీసులు చితకబాదారు. కాషాయ పార్టీ ఎప్పుడూ ప్రజల రక్షణ, శాంతిని మాత్రమే కాంక్షిస్తుంది. ప్రతీకారం అనేది మా పార్టీలో ఉండదు. కాంగ్రెస్ పార్టీ పేరుకే లౌకికవాదం కానీ.. మతోన్మాదులను ప్రోత్సహిస్తోంది. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్‌లో అనేక సందర్భాల్లో బాంబులు పేలాయి. వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. కేంద్రంలో మోదీ సర్కార్ వచ్చాక ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతోంది" అని ఈటల అన్నారు.

# హోటల్‌లో వెంటపడిన కుక్క.. మూడో అంతస్తు నుంచి పడి యువకుడి మృతి



శేరిలింగంపల్లి: హైదరాబాద్‌లోని చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. హోటల్‌లో కుక్క వెంటపడటంతో మూడో అంతస్తు నుంచి పడి యువకుడు మృతిచెందాడు.

వివరాల్లోకి వెళితే.. రామచంద్రాపురంలోని అశోక్‌నగర్‌లో తెనాలి యువకుడు ఉదయ్ (23) ఉంటున్నాడు. ఆదివారం స్నేహితులతో కలిసి అతడు చందానగర్‌లోని వీవీప్రైడ్ హోటల్‌కు వెళ్లాడు. హోటల్ మూడో అంతస్తు బాల్కనీలోకి వెళ్లగానే ఓ కుక్క కనిపించడంతో ఉదయ్ దాన్ని తరిమేందుకు యత్నించాడు. అది వెంటపడటంతో తప్పించుకునేందుకు పరిగెత్తాడు. ఈ క్రమంలో హోటల్ కిటికీ నుంచి కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. దీనికి సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగినా బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. విషయం బయటకు పొక్కడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.




# తెలంగాణలో మోస్తరు వర్షాలు.. హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదారాబాద్: తమిళనాడు పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టం నుంచి 5.8 కి.మీ ఎత్తు వరకు విస్తరించి కొనసాగిన ఆవర్తనం మంగళవారం బలహీనపడింది. తెలంగాణలోని పలు జిల్లాల్లో ఇవాళ, రేపు, ఎల్లుండి ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. ఇవాళ ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్, రంగారెడ్డి, హైదారాబాద్‌తో పాటు కామారెడ్డి జిల్లాలకు వర్ష సూచన ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో కొనసాగిన అల్పపీడనం పశ్చిమ వాయువ్యదిశగా కదులుతూ మంగళవారం ఉదయం వాయుగుండంగా మారింది. ఇది పశ్చిమ వాయువ్యదిశగా కదులుతూ మరింత బలపడి ఈ నెల 23న తూర్పు మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

ఇది వాయువ్య దిశగా కదులుతూ 24న ఉదయానికి తీవ్ర తుపానుగా ఉద్ధృతి చెంది ఒడిశా-పశ్చిమబెంగాల్ తీరాన్ని 24న రాత్రి లేదా 25న ఉదయం పూరి, సాగర్ ఐలండ్స్ మధ్య దాటే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేసింది. దీని ప్రభావం తెలంగాణపై ఉండే అవకాశం లేదని అధికారులు తెలిపారు.



# మంత్రి కోమటిరెడ్డి ఇంటిని ముట్టడించిన ట్రిపుల్ ఆర్ రైతులు..

యాదాద్రి భువనగిరి : ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని రాయగిరి ట్రిపుల్ ఆర్ రైతులు ఆందోళనలు ఉధృతం చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని అడ్డుకున్నారు. మంగళవారం ఉదయమే పెద్ద ఎత్తున మంత్రి ఇంటికి చేరుకున్న రైతులు గేట్ బయట ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంత్రి బయటకు రాగానే ఒక్కసారిగా చుట్టిముట్టిన రైతులు ప్రశ్నల వర్షం కురిపించారు. బయటకు వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. నాడు అలైన్‌మెంట్ మారుస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ విషయంలో రాష్ట్ర సర్కారు వివక్షను ప్రదర్శిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రిపుల్ ఆర్‌లో భాగంగా ఉత్తర భాగానికి ఒక విధంగా, దక్షిణ భాగానికి మరోలా వ్యవహరిస్తున్నది. దక్షిణ భాగంలో అడ్డగోలుగా మార్పులు చేస్తున్న ప్రభుత్వం రాయగిరి అలైన్‌మెంట్ మార్చాలని రైతులు పెద్దఎత్తున నినదించారు.

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను 40 కిలోమీటర్ల అవతల నుంచి తీసుకుపోవాలి. భూమికి బదులుగా భూమి ఇవ్వాలి, లేనియెడల బహిరంగ మార్కెట్ వాల్యూ ప్రకారంగా నష్టపరిహారంతో పాటు ఉపాధి కల్పించాలని కోరారు. అనంతరం మంత్రికి వినతి పత్రం అందించారు. అయితే నా చేతిలో ఏమీ లేదు.. అంతా సీఎం రేవంత్ రెడ్డి చూస్తున్నారని మంత్రి దాటవేశారు.

# నువ్వు బాయిలర్ కోడి.. మేము నాటు కోడి.. కేటీఆర్‌పై జగ్గారెడ్డి సెటైర్



హైదరాబాద్, అక్టోబర్ 22: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మాజీ మంత్రి కేటీఆర్ చిన్న పిల్లల్లా మాట్లాడుతున్నారని... కేటీఆర్‌కు రాజకీయ పరిజ్ఞానం ఉందా అని ప్రశ్నించారు. సీఎం ఏం చేసినా దాన్ని చెడుగా కేటీఆర్, హరీష్ రావు వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా ద్వారా కన్ఫ్యూజ్ క్రియేట్ చేస్తోందన్నారు. "కేటీఆర్ బాయిలర్ కోడి. మేము నాటు కోడి. కేటీఆర్‌ను కేసీఆర్ నాజూగ్గా పెంచారు. అయ్య పేరుతో రేవంత్ రెడ్డి సీఎం కాలేదు. ఢక్కాముక్కీలు తిని రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు. కేటీఆర్ రాజకీయం నేర్చుకోవాలంటే రేవంత్ రెడ్డి దగ్గరకి పోయి క్లాస్‌లు తీసుకోవాలి" అంటూ హితవుపలికారు. దామగుండం 360 మీటర్ల ఎత్తు ఉండి.. అక్కడ నుంచి సిగ్నల్స్ పంపడానికి ఎటువంటి ఇబ్బందులు లేకపోవడంతో పాటు అనేక సానుకూలతలు ఉండటంతో అక్కడ రాడార్ ఏర్పాటు చేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఎత్తు ఉంది కాబట్టి మనం సేఫ్ అన్నారు. బీఆర్ఎస్ దండుపాళ్యం గ్యాంగ్‌లా తయారయ్యిందని విరుచుకుపడ్డారు. కేటీఆర్ నంబర్ వన్ బేవకూఫ్ అంటూ విమర్శించారు. ఈ దేశంలో రాష్ట్రపతి ఢిల్లీ తరువాత వచ్చి నివసించేది హైదరాబాద్ అన్నారు. దేశ రక్షణ కోసం కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సీఎం ఇంప్లిమెంట్ చేశారన్నారు. దామగుండంలో రాడార్‌కు జీవో ఇచ్చిందే బీఆర్ఎస్ ప్రభుత్వం అని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

**కేటీఆర్‌పై కోమటిరెడ్డి ఫైర్ :** మాజీ మంత్రి కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీల అంశంపై ఈఆర్సీ దగ్గరకు వెళ్ళటం పెద్ద జోక్ అని... ఆయన జోకర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్‌లో ఒక్క సీటు రాకున్నా.. అసెంబ్లీలో ఓడించినా బుద్ధి రాలేదంటూ మండిపడ్డారు. 200 యూనిట్ల ఫ్రీ కరెంటు పేద వాళ్ళకు తమ ప్రభుత్వం ఇస్తుందన్నారు. కేంద్ర మంత్రులు సంజయ్, కిషన్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి ఎంత నిధులు తెచ్చారని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు.

# అడవి బిడ్డల ఘీంకార స్వరం కుమ్రం భీం : హరీశ్‌రావు

హైదరాబాద్ : గిరిజనుల ఆరాధ్య దైవం కుమ్రం భీం జయంతి సందర్భంగా సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఘనంగా నివాళులర్పించారు. అడవి బిడ్డల ఘీంకార స్వరం ఆయన అని పేర్కొన్నారు. ఆదివాసుల స్వయం ప్రతిపత్తే ధ్యేయంగా ఎగిసిన ఉద్యమబావుట.. దేశానికి స్వాతంత్రం రాకముందే 'జల్ జంగల్ జమీన్' నినాదంతో పోరు తలపెట్టిన పోరాట యోధుడు కుమ్రం భీం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. తమ భూముల్లోంచి నిర్దాక్షిణ్యంగా గెంటేయడంతో కుమ్రం భీం ఆధ్వర్యంలో 1940 'జోడేఘాట్(బాబేఝరి) సాయుధ తిరుగుబాటు మొదలైందని, ఆదివాసీల స్వయం పాలన కోసం ఆయన చేసిన జోడేఘాట్ తిరుగుబాటు మహోజ్వల చరిత్రగా నిలిచిందన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి ఆదర్శమని, కుమ్రం భీం ఆశయ అడుగు జాడల్లో పయనిద్దామన్నారు. గోండు వీరుడికి జోహార్లు అంటూ ట్వీట్ చేశారు.

# ప్రాణాలను పణంగా పెట్టైనా అంబుజా సిమెంట్ పరిశ్రమను అడ్డుకుంటాం..బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు

యాదాద్రి భువనగిరి : ప్రాణాలను పణంగా పెట్టి అయినా అంబుజా సిమెంట్ పరిశ్రమను అడ్డుకుంటామని బీఆర్ఎస్ శ్రేణులు స్పష్టం చేశారు. రామన్నపేటలో అంబుజా సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేయొద్దని ఆందోళన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రాణాలైనా అర్పిస్తాం అంబుజాని అడ్డుకుంటాం, అంబుజా వద్దు- ఆరోగ్యం ముద్దు.. అంటూ ప్లకార్డుల ప్రదర్శన చేపట్టారు. నాడు కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు, సాగునీరు ఇచ్చి రైతులకు చేయూత అందిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతున్నదని మండిపడ్డారు. సిమెంట్ పరిశ్రమతో ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును మానుకోకపోతే కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com